

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 25.10.2025 | సంపుటి : 2 | సంచిక :260 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 25.10.2025 | volume : 2 | Issue : 260 | Pages : 8 | Cost : 2/- |


# బతుకులు బుగ్గి

## కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

- మంటల్లో కాలి బూడిదయిన బస్సు
- ప్రమాదంలో 19 మంది దుర్మరణం
- బతికిబయటపడ్డ 22మంది
- పలువురికి గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స
- బైకును ఢీకొని తగులబడ్డ బస్సు
- ప్రమాదం గుర్తించని డ్రైవర్లు



**యాటకందని విషాదం..తెల్లవారు జామున ఏం జరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగలుబడుతోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి.** ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరిగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిదయ్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది.

02




### బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

బస్సు పూర్తిగా దగ్ధమైంది.అయితే, బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్పందించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు.

### మృతుల కుటుంబాలకు 5లక్షలు

హైదరాబాద్: ఏపీలోని కర్నూలు శివారులో జరిగిన బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ప్రమాదంలో చనిపోయిన తెలంగాణ పౌరుల కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షల ఆర్థికసాయం అందిస్తామని వెల్లడించింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

---



06

### రష్యాపై ఆంక్షల ఎఫెక్ట్..

భారీగా పెరిగిన సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు



06

### ఆరు నెలల్లో ఆంక్షల తీవ్రత తెలుస్తుంది

రష్యాకు ట్రంప్ హెచ్చరిక



07

### ఆరు రోజుల వరుస లాభాలకు బ్రేక్

---

# జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

తుది జాబితా ప్రకటించిన ఎన్నికల అధికారి

నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు

**జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి.**




హైదరాబాద్, అక్టోబర్24 : 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. అయితే, ఆయన మరణంతో - మిగతా 2 లో..

---




# దమ్ముంటే ఒక్కడివే రా

## సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

### నిరుద్యోగుల ప్రశ్నలకు సమాధానం చెప్పగలవా

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గట్టిగా బుద్ధి చెప్పాలి


బాకీ కార్డు విడుదల సందర్భంగా హరీష్ విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్24 :సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పోలీసులు లేకుండా ఒక్కసారి అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీకి రావాలని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. బట్టలూడదీసి ఊడగొడుతారని అంటే ఘాటుగా హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ నిరుద్యోగ - మిగతా 2 లో..

---

## ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా అదనపు కలెక్టర్లు

### తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం




హైదరాబాద్, అక్టోబర్ 24 : తెలంగాణ ప్రభుత్వంమరో కీల క నిర్ణయం తీసుకుంది. అన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్లని ఫారె స్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లు గా నియమిస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ 2 లో..

---



## ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

విక్టోరియా పార్లమెంట్ సందర్శన

హైదరాబాద్, అక్టోబర్ 24 :ఆస్ట్రేలియాలో తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా విక్టోరియా పార్లమెంట్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా - మిగతా 2 లో..

---

## జంగిల్ రాజ్‌పై వందేళ్లయినా చర్చిస్తారు

### ఆర్జెడి గత పాలనపై ప్రధాని మోడీ ఘాటు వ్యాఖ్యలు

**బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు తమ దురాగతాలను దాచిపెట్టేందుకు ఎంత ప్రయత్నించినా.. ప్రజలు క్షమించరన్నారు. ప్రతిపక్షాలది 'మహాగఠ్‌బంధన్' కాదని.. 'లఠ్‌బంధన్ అంటే నేరస్థుల కూటమి అని విమర్శించారు.**



- మిగతా 2 లో..



# జంగిల్ రాజ్‌పై వందేళ్లయినా చర్చిస్తారు


## ఆర్జెడి గత పాలనపై ప్రధాని మోడీ ఘాటు వ్యాఖ్యలు

**పాట్నా, అక్టోబర్ 24 :** బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు తమ దురాగతాలను దాచిపెట్టేందుకు ఎంత ప్రయత్నించినా.. ప్రజలు క్షమించరన్నారు. ప్రతిపక్షాలది 'మహాగర్‌బంధన్' కాదని.. 'లఠ్‌బంధన్ అంటే నేరస్థుల కూటమి అని విమర్శించారు. ఆ పార్టీల నేతలంతా బెయిల్‌పై బయట తిరుగుతున్నవారేనని పేర్కొన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్: యువ సంవాద్' ఆడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. బిహార్‌లో ఆర్జేడీ పాలనలో సాగిన అకృత్యాలపై నేటి తరం యువకులకు అవగాహన కల్పించేలా భాజపా (ఃఏఖ) శ్రేణులు చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశంలో ఎన్డీయే సర్కారు నేతృత్వంలో అభివృద్ధి మహాయజ్ఞం జరుగుతోందన్నారు. బిహార్ సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. అందుకే.. స్థానిక యువత సైతం 'వేగంగా దూసుకెళ్తోంది బిహార్.. మరోసారి ఎన్డీయే సర్కార్' అని నినదిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నేతలకు తమలో తాము ఎలా పోట్లాడాలో, స్వప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో మాత్రమే తెలుసు. బిహార్‌ను ఆటవిక రాజ్యం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సీఎం నీతీశ్‌కుమార్, ఎన్డీయే నేతలు ఎంతో కృషి చేశారు. స్థానికంగా మావోయిస్టులను నిర్మూలించే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో టెక్నాలజీ, స్టార్టప్ హబ్‌లను సృష్టించాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికలు రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయి. యువత కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతో పాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరఫున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరఫున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరఫున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు. తెలంగాణ ఉద్యమకారుల తరఫున ఒకరు సమర్పించారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.



# ఆస్ట్రేలియాలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

శ్రీధర్‌బాబుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ లీ తార్లామిస్, పార్లమెంటరీ సెక్రటరీ షీనా వాట్ ఘన స్వాగతం పలికారు. శాసన ప్రక్రియలు, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీపై సుదీర్ఘంగా చర్చించారు. పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే పౌరుల భాగస్వామ్యం కీలకమని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. టెక్నాలజీ ఆధారిత, పౌర కేంద్రిత పాలన వైపు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ? విక్టోరియా ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్ పెంచేందుకు చొరవ చూపుతామని మంత్రి తెలిపారు. అలాగే తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను విక్టోరియా ప్రతినిధులకు మంత్రి వివరించారు. ఇక... రాష్ట్రంపై విక్టోరియా నేతలు ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ రోల్ మోడల్ రాష్ట్రం అంటూ కొనియాడారు. ద్వైపాక్షిక సహకారం పెంపొందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా విక్టోరియా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# తెల్లారిపోయిన బతుకులు

**కర్నూలు, అక్టోబర్ 24 :** శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2–3 గంటల సమయం. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. భయానకమైన ఘటనా స్థలి దృశ్యాలు ప్రమాద స్థాయిని కళ్లకు కడుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేసింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు. బస్సు బైక్‌ను



బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.. పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నుంచి రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, నవీన్‌కుమార్, అఖిల్, జష్మిత, అకీర, రమేష్, జయసూర్య, సుబ్రహ్మణ్యం బయటపడ్డారు. హిందూపూర్‌కు చెందిన నవీన్ అనే యువకుడు బస్సు ప్రమాదంలో గాయాలైన వారిని ఆరుగురిని తన కారులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమారెడ్డి బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి ఆగారు. పోలీసులకు ఆమె సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

# కర్నూలు దుర్ఘటనపై చంద్రబాబు సీరియస్

- ప్రమాదానికి నిర్లక్ష్యం కారణమైతే చర్యలు తప్పవు
- అధికారులు, మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్
- బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీపై చర్యలకు ఆదేశం

**అమరావతి, అక్టోబర్ 24 :** కర్నూలు బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికారులతో సమగ్ర విచారణకు ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాల న్నారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో బస్సుల సాంకేతిక తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదికను కోరారు. అన్ని జిల్లాల్లో బస్సుల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు ఆదేశాలు జారీచేశారు. ప్రమాదానికి కారణం.. నిర్లక్ష్యమని తేలితే కఠిన చర్యలు తప్పవని ట్రావెల్స్ బస్సు యాజమాన్యానికి సీఎం హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యత, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం త్వరితగతిన అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నారని సీఎంకు తెలియజేశారు మంత్రి. అలాగే ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రజల భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# మృతుల కుటుంబాలకు 5లక్షలు

## క్షతగాత్రులకు 2లక్షల పరిహారం

- డిఎన్‌ఎ పరీక్షల ఆధారంగా ఆనవాళ్లు అప్పగింత
- డ్రైవర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన హోంమంత్రి అనిత

**కర్నూలు, అక్టోబర్ 24 :** బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మృతుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున, ఒడిశా, బిహార్ నుంచి ఒక్కొక్కరు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారని వెల్లడించారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉంది. కర్నూలు వ్యాస్ ఆడిటోరియంలో మంత్రులు అనిత, రాం ప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బస్సులో 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది బయటపడ్డారు. స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హోం మంత్రి వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయన్నారు. చనిపోయిన వ్యక్తుల డీఎన్ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేస్తామన్నారు. ఈ ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎన్ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తాయన్నారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు మరో 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతూ ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బస్సు డ్రైవర్లిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డుపై పడి ఉన్న బైకును ఢీ కొట్టినట్లు బస్సు డ్రైవర్ చెప్పాడని, అంతకుముందే రోడ్డు ప్రమాదంలో బైక్ పడిపోయి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. బైకు పైనుంచి బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ చెప్పాడు. ప్రమాదానికి గల కారాణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని ఎస్పీ వివరించారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వారిని మంత్రులు పరామర్శించి వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మంత్రుల వెంట డీజీపీ హరీశ్ గుప్తా, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, దస్తగిరి ఉన్నారు.

# కావేరి బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు

## పెండింగ్‌లో రూ.23,120 ఫైన్లు
## అనేక ఉల్లంఘన కేసులు ఉన్నట్లు గుర్తింపు

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన బస్సు 9490 నంబరుతో రిజిస్టర్ అయినట్లు ఏపీ రవాణా శాఖ వెల్లడించింది. ఈ బస్సు ఫిట్‌గానే ఉందని, బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయని తెలిపింది. 'కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి బస్సు నడుపుతున్నారు. 2018 మే 2న బస్సును డామన్ డయ్యూలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ బస్సుకు 2030 ఏప్రిల్ 30 వరకు టూరిస్ట్ పర్మిట్ జారీ అయ్యింది. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌గా ఉంది. 2027 మార్చి 31 వరకు ఫిట్‌నెస్ ఉంది. 2026 ఏప్రిల్ 20 వరకు బస్సుకు ఇన్సూరెన్స్ ఉంది. బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయి. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తు నివేదిక మేరకు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం అని రవాణా శాఖ పేర్కొంది. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. అయితే ఇప్పటి వరకు వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాన్యం ఇంక స్పందించిక పోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

# తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ పదవి రద్దు చేసి.. కొత్త బాధ్యతలని అదనపు కలెక్టర్లకు అప్పగించింది. ఈ క్రమంలో అడవి భూసర్వే, హక్కుల నిర్ధారణ, సెటిల్‌మెంట్ పనులు వీరి పరిధిలోకి రానున్నాయి. 1967 ఫారెస్ట్ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనుంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది.

# సెక్యూరిటీ లేకుండా చిక్కడపల్లికి రాగలవా

(మొదటిపేజీ తరువాయి)

బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. ఇచ్చిన మాట నిలుపుకో అని బాకీ కార్డులు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల ముందు వేడుకున్నడు, వాడుకున్నడు. అధికారంలోకి వచ్చాక వదిలేసారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో అశోక్ నగర్, సరూర్ నగర్ స్టేడియంలో మీటింగులు పెట్టించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని మాయ మాటలు చెప్పారు. మోసం చేసారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు గానీ, రెండు నెలల ముందే మద్యం నోటిఫికేషన్లు ఇచ్చిండు. జాబ్ క్యాలెండర్ అని జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పినట్లు ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ బోగస్. రాజీవ్ యువ వికాసం వికసించకముందే వాడిపోయింది. జూన్ 2 నాడు 5 లక్షల మంది నిరుద్యోగులకు యువ వికాసం కింద సాయం చేస్తం అన్నడు. మాటలు బోగస్ హామీలు బోగస్ అయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు మీ చేతిలో అవకాశం ఉంది. కొంతమంది నిరుద్యోగులు కూడా నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుగా జూబ్లిహిల్స్‌లో ఓడించాలె. ఆనాడు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు బస్సు యాత్ర చేసారు. కాంగ్రెస్‌కు సురుకు పుట్టాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు నిరుద్యోగులు దండు కట్టాలె. నిరుద్యోగ యువకులే కాంగ్రెస్‌ను ఓడించారనే విషయం రాహుల్ గాంధీకి అర్థం కావాలె. తనతప్పు తాను తెలుసుకునేందుకు మనం కాంగ్రెస్‌ను ఓడించాలె అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. విద్యా శాఖ మంత్రిగా, మున్సిపల్ మంత్రిగా, హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. కలెక్షన్ల




మంత్రిగా, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయిపోయిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. జీవో 29, జీవో 55పై నేను ఆనాడు అసెంబ్లీలో గట్టిగా మాట్లాడాను. భట్టి గారు దళిత మంత్రిగా ఉన్నారు మీరైనా పట్టించుకోండి అంటే పట్టించుకోలేదు. జాబులు నింపండి అంటే జేబులు నింపుకుంటున్నరు. గల్లా పెట్టెలు నింపుకుంటున్నరు. విద్య రాని వ్యక్తి విద్య శాఖ మంత్రి. అతి ఎక్కువ క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి హోం మంత్రిగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. మా ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించింది. నేడు ఈ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి గన్నులు పెట్టి బెదిరిస్తున్నరు. రేవంత్ రెడ్డి గన్ ఇచ్చి పంపించాడు అని మంత్రి కుమార్తె చెప్పింది. ఐఏఎస్ ఆఫీసర్ వీఆర్‌ఎస్‌తో మధ్యలోనే వెళ్లిపోతున్నడు. లక్షా 64వేల ప్రభుత్వ ఉద్యోగాలను బిఆర్ఎస్ ఇచ్చింది. గ్రూప్ 1, గ్రూప్ 2 ఆలస్యం అయ్యింది. 5 శాతం లోకల్ రిజర్వేషన్ సాధించాం. నోటిఫికేషన్లు ఇచ్చింది బిఆర్ఎస్, పరీక్ష పెట్టింది బిఆర్ఎస్, ఫిజికల్ టెస్టు పెట్టింది బిఆర్ఎస్, ఎంపిక చేసింది బిఆర్ఎస్. నియామకపత్రాలు ఇచ్చింది రేవంత్. దీంతో 60వేల ఉద్యోగాలు ఇచ్చినా అని ప్రచారం చేసుకుంటున్నడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు మండిపడ్డారు. అందులో 15400 ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 9 వేల గురుకులాల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. 8 వేల గ్రూప్ 4 నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. హెల్త్ డిపార్టుమెంట్‌లో 7 వేల ఉద్యోగాలు ఇచ్చింది బిఆర్ఎస్. జేఎల్ 1300, ఆరు వేల టీచర్ల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది బిఆర్ఎస్. అచ్చంగా కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసింది కేవలం 10 వేల ఉద్యోగాలు మాత్రమే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేం హామి ఇస్తున్నాం. అసెంబ్లీ వేదికగా మీకోసం పోరాటం చేస్తం. మొన్న అడిగితే ఒక్కటే నాడు అసెంబ్లీ పెట్టి పారిపోయిండు. అసెంబ్లీ పెట్టడానికి కూడా భయమే. జెన్కో, జీపీవో, పోలీసు, డిప్యూటీ సర్వేయర్, ఇతర గ్రూప్స్ నోటిఫికేషన్ల కోసం బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. అన్ని జిల్లా కేంద్రంలో బాకీ కార్డులు పెట్టి యువతను ఏకం చేస్తం. ప్రత్యక్ష పోరాటం బిఆర్ఎస్ చేస్తుంది. మీకు అండగా ఉంటది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# సిఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

## పెళ్లికి ఆహ్వానిస్తూ పత్రిక అందచేత



హైదరాబాద్, అక్టోబర్ 24 : టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ బ్యాచిలర్ లైఫ్ కు గుడ్ బై చెప్పనున్నారు. తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. నటి శిరీష లేళ్లతో వివాహ బంధంలో అడుగుపెట్టనున్నారు. నారా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న నారా రోహిత్.. శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన వివాహానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నారా రోహిత్ శిరీషల వివాహం ఈ నెల అక్టోబర్ 30న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వివాహ వేడుకలను ఏకంగా నాలుగు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నారా కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 25న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలవుతాయి. అక్టోబర్ 26న సంప్రదాయబద్ధంగా పెళ్లికొడుకు కార్యక్రమం జరగనుంది. అక్టోబర్ 28న మెహందీ వేడుక, 29న సంగీత్ నైట్ నిర్వహించనున్నారు. చివరగా, అక్టోబర్ 30న రాత్రి 10:35 గంటలకు శుభ ముహూర్తాన రోహిత్, శిరీష ఒక్కటవ్వనున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భువనేశ్వరి దంపతులు పెద్దలుగా ఈ వివాహ వేడుకలో పాల్గొననున్నారు. రోహిత్, శిరీషల పరిచయం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వారిద్దరూ కలిసి నటించిన 'ప్రతినిధి?2' సినిమా షూటింగ్ సమయంలోనే స్నేహం ఏర్పడింది. అది క్రమంగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో గత ఏడాది అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో వీరి నిశ్చితార్థం ఘనంగా జరిగింది. అయితే, నిశ్చితార్థం జరిగిన కొద్ది కాలానికే రోహిత్ తండ్రి నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూయడంతో పెళ్లిని వాయిదా పడింది. దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి తేదీ ఖరారు చేశారు. సినీ పరిశ్రమలో ఈ వివాహం'ఈ ఏడాది అత్యంత ఆకర్షణీయమైన స్టార్ వెడ్డింగ్'గా నిలవనుంది.



## గురుపురబ్ ఉత్సవానికి సిఎం రేవంత్‌కు ఆహ్వానం

హైదరాబాద్,అక్టోబర్24:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన పంజాబ్ మంత్రులు సంజీవ్ అరోరా, గుర్మీత్ సింగ్ ఖుడియన్‌లు కలిశారు. పంజాబ్‌లో జరిగే 350వ 'గురుపురబ్' ఉత్సవానికి పంజాబ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రుల ప్రతినిధి బృందం ఆహ్వానం అందచేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు. మంత్రుల బృందానికి సిఎం స్వాగతించి శాలువా కప్పి సన్మానించారు.

## చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపులు

హైదరాబాద్,అక్టోబర్24 : చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా 3,610 మంది చిన్న కాంట్రాక్టర్లకు రూ.94.77 కోట్ల బిల్లులు చెల్లించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి ఈ సందర్భంగా చిన్న కాంట్రాక్టర్లంతా ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన పెండింగ్ బిల్లులు కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. బిల్లుల చెల్లింపుతో ఉపశమనం కలిగిందని కాంట్రాక్టర్లు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరుకులు

## సంక్షేమశాఖ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు





హైదరాబాద్,అక్టోబర్24: అంగన్వాడీ కేంద్రాలకు సరకుల సరఫరా నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనే, బాలామృతం, మురుకులు, బియ్యం సరఫరాపై జిల్లాల వారిగా మంత్రి సీతక్క సమీక్ష చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల ప్రగతిని మంత్రి సీతక్క సమీక్షించారు. పలు జిల్లాల్లో సరకుల సరఫరా ఆశించిన మేర లేకపోవడంపై కాంట్రాక్టర్లపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మాదిరిగా సరకుల సప్లైయర్స్ వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సరకుల సరఫరాలో అలసత్వం వహిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆజ్ఞాపించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకారం అందించడంలో రాజీ పడేది లేదని మందలించారు. లబ్దిదారులకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుకుం జారీ చేశారు. చిన్నారుల సంరక్షణ విషయంలో అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన సమయం నుంచి వారు వెళ్లే వరకు సిబ్బంది బాధ్యత వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగు నీటి సదుపాయం, టాయిలెట్ సౌకర్యాల కల్పన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య, హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెల కనీసం ఒక చిన్నారి చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు మంత్రి సీతక్క. ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయనే భరోసాను తల్లిదండ్రులకు కల్పించాలని మంత్రి సూచించారు. జిల్లా అధికారులు ప్రతి నెలా ప్రోగ్రెస్ రిపోర్టులు పంపించాలని ఆజ్ఞాపించారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని దిశానిర్దేశర చేశారు. ఈ సమీక్షలో మంత్రి సీతక్కతోపాటు ఆ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు.

## బస్సు ప్రమాదంలో బైకర్ శివశంకర్ మృతి

### ఆస్పత్రి వద్ద కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

**కర్నూలు, అక్టోబర్ 24 :** కర్నూలు జిల్లా శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘోర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో మొత్తం 19 మంది ప్రయాణికులు, ఒక బైకర్ మృతిచెందారు. ఈ ప్రమాదంలో మొత్తం 11 మందికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన వ్యక్తి పేరు శివశంకర్‌గా తెలుస్తోంది. శివశంకర్ కర్నూలు పట్టణంలోని ప్రజానగర్‌కి చెందిన వ్యక్తి. శివశంకర్ మృతిచెందాడని సమాచారం అందిన వెంటనే ఆయన కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చారు. ఈ సందర్భంగా శివశంకర్ కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద కన్నీటి పర్యంతం అయ్యారు. శివశంకర్ గ్రానైట్ పనికి వెళ్తాడని, గురువారం రాత్రి ఇంటికి వచ్చాడని తల్లి చెబుతూ కన్నీరు మున్నీరుగా విలపించింది. శుక్రవారం తెల్లవారుజామున పనికోసం వెళ్లాడని తెలిపింది. తన పని అయిపోయిన తర్వాత ఇంటికి వస్తానని శివశంకర్ చెప్పాడని అతని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. గ్రానైట్ పనులతో పాటు పెయింటింగ్ పనులకి కూడా రోజూవారీ కూలిగా వెళ్తాడని శివశంకర్ సోదరుడు చెప్పాడు. శివశంకర్ ఎక్కువగా గ్రానైట్ పనులకి పల్సర్ బైక్ పైనే వస్తుండేవాడని గ్రానైట్ యజమాని తెలిపారు. ఆ బైక్‌నే శివశంకర్ వినియోగిస్తుంటాడని గ్రానైట్ యజమాని పేర్కొన్నారు.

## పాముకాటుకు విద్యార్థి మృతి

**పెద్దపల్లి, అక్టోబర్ 24 :** దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన డిగ్రీ విద్యార్థిని పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోరూపు నారాయణపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రం అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థినికి శుక్రవారం పాముకాటుకు గురై మృత్యువాత పడింది. అక్షిత సుల్తానాబాద్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతోంది. దీపావళి పండుగ సందర్భంగా సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. శుక్రవారం కాలేజీకి పోతా అంటే తల్లి శుక్రవారం రోజు ఎందుకు వద్దు అనడంతో ఇంటి వద్దనే ఉండిపోయింది. తండ్రి శ్రీనివాస్ దివ్యాంగుడు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో తల్లి కోమల కూలీ చేస్తేనే కుటుంబ పోషణ సాగుతుంది. దీంతో బిడ్డను ఇంటి వద్ద ఉంచి తల్లి పత్తి పంటను ఏరెందుకు కూలికి వెళ్ళింది. ఇంటి వద్ద అక్షిత కుర్చీలో కూర్చొని హోంవర్క్ చేసుకుంటుండగా పాము కాలుకు కాటు వేసింది. దీంతో వెంటనే తేరుకుని తనను ఏదో కుట్టిందని అరవడంతో ఇంటి పరిసర ప్రాంత ప్రజలు పరిగెత్తుకు వచ్చి చూడగా కుర్చీ కింద పాము ఉన్నట్లు గుర్తించారు. పామును కొడదామని లోపే అక్కడి నుంచి పారిపోయింది.



## ఔటర్ రింగ్ రోడ్డుపై అగ్నిప్రమాదం

### కారులో మంటలు చెలరేగి దగ్ధం


హైదరాబాద్,అక్టోబర్24 :హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై అగ్నిప్రమాదం జరిగింది. రన్నింగ్ లో ఉన్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు గుర్తించిన కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అప్రమత్తమై కిందకు దిగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై అగ్నిప్రమాదం జరిగింది. సిద్దిపేట నుంచి హైదరాబాద్ కు కొందరు వ్యక్తులు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ కి రాగానే ఒక్కసారిగి మంటలు చెలరేగాయి. గమనించిన అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు వెంటనే కారు దిగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చూస్తూండగనే కారు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలార్పారు.

# పోచారంలో ప్రహారీగోడ తొలగింపు

## హైడ్రా చర్యలతో స్థానికుల ఆనందం

హైదరాబాద్,అక్టోబర్24 :ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది. చెరువులు, కుంటలకు కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి పునరుద్ధరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ పోచారంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శుక్రవారం హైడ్రా తొలగించి 8 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించింది. 1978లో 27 ఎకరాల ఎకరాల్లో 400 ప్లాట్లతో జీపీ లే అవుట్ ఏర్పాటు చేయగా.. అందులో ఓ వ్యక్తి 6.18 ఎకరాల భూమిని తమదే అంటూ అక్రమంగా ప్రహరీ నిర్మించాడు. అక్రమ ప్రహరీపై సుమారు 8 ఏళ్లుగా పోరాడిన లే అవుట్ సొసైటీ.. చివరకు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేసింది. సొసైటీ సభ్యుల ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు.దీంతో ప్రహరీ గోడను తొలగించారు హైడ్రా సిబ్బంది. 8 ఏళ్లుగా ఉన్న సమస్యకు హైడ్రాతో పరిష్కారం లభించడంతో హైడ్రా చర్యల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు.





## కర్నూలు బస్సు ప్రమాదంలో ఇద్దరు టెక్కీల మృతి

### ఒకరు ఎపివాసి కాగా..మరొకరు తెలంగాణ వాసి


### ఇద్దరు అమ్మాయిలూ బెంగుళూరులో పని

హైదరాబాద్,అక్టోబర్24: కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మృతిచెందారు. ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి (27), తెలంగాణలోని యాదాద్రి జిల్లా గుండాల మండలం వస్తకొండూరుకు చెందిన అనూషరెడ్డి చనిపోయారు. వీరిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. ధాత్రి ఇటీవల హైదరాబాద్‌లోని పెదనాన్న ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు గురువారం రాత్రి వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న ధాత్రి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తల్లి వాణి, బంధువులు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. ధాత్రి మృతికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. యాదాద్రి జిల్లాకు చెందిన అనూషరెడ్డి దీపావళికి స్వగ్రామానికి వచ్చి గురువారం రాత్రి బెంగళూరుకు బయల్దేరారు. ఖైరతాబాద్‌లో బస్సు ఎక్కి ఈ దుర్ఘటనలో మృతిచెందారు. అనూష మృతితో ఆమె తల్లిదండ్రులు కన్నీమున్నీరవు తున్నారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన మరికొందరిని గుర్తించాల్సి ఉంది.

# ఎన్డీఏ అంటే వికాసం...

## ఇండియా కూటమి వినాశనం

### బీహార్ ఎన్నికల ప్రచారంలో జెపి నడ్డా విసుర్లు



**పాట్నా, అక్టోబర్ 24 :** బిహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. భాగస్వామ్య పక్షాలను అంతం చేసే పరాన్నజీవి పార్టీగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ.. రంగ్‌దారీ (దోపిడీ), జంగల్‌రాజ్ (ఆటవిక పాలన), దాదాగిరీ (దౌర్జన్యం)లకు ప్రతీక అని విమర్శించారు. బిహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. తాను పట్నాలోనే పుట్టానని, బిహార్‌లోనే 20 ఏళ్లు గడిపానని.. ఆర్జేడీ చీకటి యుగం గురించి తనకు తెలుసని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, వలసలను అడ్డుకుంటామని తేజస్వీ యాదవ్ ఇచ్చిన హామీలు.. 'భూమికి ఉద్యోగం కుంభకోణం'లో ఆర్జేడీ ప్రమేయాన్ని గుర్తుచేస్తున్నాయన్నారు. మాజీ గ్యాంగ్‌స్టర్ షహబుద్దీన్ తనయుడు ఒసామాకు రఘునాథ్‌పుర్ నుంచి టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. బిహార్ విషయంలో ఆ పార్టీకి ఎంత శ్రద్ధ ఉందో ఇది తేటతెల్లం చేస్తోందన్నారు. తేజస్వీ యాదవ్ ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని భాజపా ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. 2.6 కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని తేజస్వీ చెబుతున్నారు. దీనికి రూ.12 లక్షల కోట్లు అవసరం అవుతాయి. రాష్ట్ర మొత్తం బ్జడెట్ దాదాపు రూ.3 లక్షల కోట్లు. మరి ఎక్కడి నుంచి ఉద్యోగాలు కల్పిస్తారని ఓ మీడియా సమావేశంలో ప్రశ్నించారు. ఓటర్లకు ఆర్జేడీ తప్పుడు వాగ్దానాలు ఇస్తోందని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు విశ్వసించరని చెప్పారు.

## కావేరీ యాజమాన్యంతో పాటు డ్రైవర్‌పై కేసు

**కర్నూలు, అక్టోబర్ 24 :** కర్నూలు జిల్లా బస్సు దహన ఘటనకు సంబంధించి కావేరీ ట్రావెల్స్ బస్సు యాజమాన్యం, డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్యలపై కర్నూలు జిల్లా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ బస్సులో ప్రయాణించిన ప్రయాణికుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు పెట్టారు. ఇప్పటికే ఆ బస్సుకి చెందిన ఒక డ్రైవర్ శివ నారాయణ పోలీసుల అదుపులో ఉన్నారు. అయితే, పరారీలో మరో డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్య ఉన్నారు. ముత్యాల లక్ష్మయ్యపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. బస్సు ప్రమాదంలో 19 మంది ప్రయాణికుల మృతికి కారణమయ్యారని కావేరి బస్సు యాజమాన్యం, డ్రైవర్ ముత్యాల లక్ష్మయ్యలపై పోలీసులు కేసులు పెట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా డీఐజీ కోయ ప్రవీణ్ సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. బస్సు ప్రమాద ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు చిన్నటేకూరు వద్ద మంటల్లో కాలిపోయింది.

# బంగారం ధరలను నిర్ణయించేదెవరు?



**బంగారం ధరలను ఎవరు నిర్ణయిస్తారు.. ఇది అతి పెద్ద ప్రశ్న. సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు ఉన్న భేతాళ ప్రశ్న. పెట్టుబడులు పెడుతూ పోతుంటే..అమ్మకాలు పెరిగితే ధరలు తగ్గాలి. కానీ తగ్గడం లేదు. ఇటీవల ఒక్కరోజులో 9వేలు తగ్గిందని తెగ ప్రచారం చేశారు. కానీ ఎంత పెరిగితే 9 వేలు తగ్గిందో చెబితే బాగుండేది. నిజానికి ఇప్పటికే సామాన్యులు వన్ గ్రామ్ గోల్డ్‌పై మోజు పెంచుకున్నారు. గిల్టు నగలకు ప్రాధన్యం పెరిగింది. బంగారంతో పోలిస్తే దీనిని అట్టే గుర్తించలేం. ప్రపంచ వ్యాప్తంగా బంగారం నిల్వలు, పెరుగుదలపై అన్నీ భేతాళ కథలే వినిపిస్తున్నాయి.**

నిజానికి బంగారం మీద మోజు తగ్గించుకుంటే జీవితాలు బగుపడతాయి. బంగారంపై పెట్టే పెట్టుబడులు ఇతరత్రా రంగాలపై పెడితే మంచిది. బంగారం ధరలు పెరగడం వల్ల మనిషి ప్రాణ్యాలకు విలువ లేకుండా పోతోంది. తులం బంగారం మెడలో వేసుకుని వెళ్లినా పుటుక్కున చంపేసి లాక్కెళ్లుతున్నారు. ఇటీవల వరుసగా జరిగిన ఘటనలు చూస్తుంటే బంగారం ధరలు పెరగడంతో దొంగలు ప్రాణాలు తీయడానికి కూడా వెనకాడడం లేదు. బంగారం, వెండి ఏది ఉన్నా ప్రాణాలమీదకు రావడం ఖాయం. బంగారం, వెండి ధరలు ఇలా అనూహ్యంగా పెరుగుతూ పోతుంటే సామాన్యులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టక తప్పడం లేదు. బంగారానికి వన్ గ్రామ్ గోల్డ్ ఆర్నమెంట్లు వచ్చినట్లే ..వెండిలో జర్మన్ సిల్వర్ అందుబాటులోకి వచ్చింది. ఇది కూడా ఎవరు గుర్తించలేరు. అచ్చు వెండిలాగే ఉంటుంది. ఇప్పుడు పెళ్లిళ్లు పేరంటాల్లో జర్మన్ సిల్వర్ తళుక్కుమంటోంది. ఫోటోగ్రఫీ కోసం వన్ గ్రామ్ గోల్డ్ నగలు మెరిసి పోతున్నాయి. ప్రజలు తమవల్ల కానప్పుడు వ్యామోహం తగ్గించుకుంటా రనడానికి ఈ రెండు లోహాల వాడకాన్ని గుర్తించవచ్చు. అయితే భారతదేశంలో బంగారం ధరలు గతంలో ఎప్పుడూ లేనంతగా మరొకసారి చరిత్ర సృష్టిస్తున్నాయి. ఆగస్టు నుండి బంగారం ధరలు ప్రతివారం మూడు నుండి నాలుగుసార్లు కొత్త రికార్డులు సృష్టిస్తూ, ఆకాశాన్నంటుతున్నాయి. వరుసగా ధరల పెరుగు దలతో బంగారం ధరలు ఆల్‌టైమ్ హైని తాకాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న జియోపాలిటికల్ ఉద్రిక్తతలు, అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం ప్రభావం, అలాగే అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ పెట్టుబడి దారుల నమ్మకంపై దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం, వెండి ధరల కదలికలపై అందరి చూపు పడింది. భారతదేశంలో బంగారం ధరల నిరంతర పెరుగుదల అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్ రేట్ల పెరుగుదలతో సమాంతరంగా కొనసాగుతోంది. పెట్టుబడిదారులు భద్రతా ద్రవ్యంగా బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీపావళి వారంలో రికార్డు స్థాయిలను తాకిన తర్వాత, అక్టోబర్ 24న భారతదేశంలో బంగారం మరియు వెండి ధరలు కొంత తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో లాభాల బుకింగ్,డాలర్ బలపడటం వల్ల ధరల్లో స్వల్ప సవరణ కనిపించింది. బంగారం మరియు వెండి ధరలు పరిశీలిస్తే తాజాగా 24 క్యారెట్ బంగారం గ్రాముకు 12,507, 22 క్యారెట్ బంగారం గ్రాముకు 11,464, 18 క్యారెట్ బంగారం గ్రాముకు 9,380 గా ఉంది. వెండి కిలో ధర 1.59 లక్షలుగా నమోదైంది. దీపావళి ర్యాలీ తర్వాత ఇది మార్కెట్ సాధారణ సవరణగా పరిగణించబడుతోంది. మొత్తంగా బంగారం ధరల పెరుగుదల ఇప్పుడు కొందరికి ఆనందంగానూ ఉంది. తరతరాలుగా ఇంట్లో మూలుగుతున్న బంగారం ఉన్న వాళ్లకు ఇదో ఆస్తిగా నిలుస్తోంది. తులం బంగారంపై బ్యాంకులు కూడా 70 నుంచి 80 వేల వరకు రుణాలను ఇస్తున్నాయి.

సామాన్యులకు దూరమవుతున్న బంగారం సంపన్నులకు చేరువవుతోందని చెప్పలేం. ఇప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో పసిడి ధరలు రికార్డుల్ని తిరగ రాస్తోంది. దేశీయ మార్కెట్లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు,పండగ, పెళ్లిళ్ల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. బుధవారం హైదరాబాద్లో రూ.1.30 లక్షలు దాటింది. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3వేలు ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం మీద పెట్టే పెట్టుబడులకు మంచి భద్రత ఉందన్న మాట ఎవరూ కాదనలేరు. అలాగని బంగారం పెరుగుతుందో పెరగదో, ఒక వేళ తగ్గుతుందా, ఎలాంటి పరిస్థితుల్లో తగ్గుతుంది, ఎప్పుడు జాగ్రత్త పడాలి, ఎలా జాగ్రత్త పడాలన్న అంశాలపై పూర్తి అంచనా, విశ్లేషణలు అవసరం. ఎందుకంటే ఒక్కోసారి మనం కొన్న ధరలు అలాగే ఉంటాయని అనుకోవడానికి లేదు. ఏ క్షణమైనా ఢమాల్ మని అనవచ్చు. అప్పుడే బంగారం లాంటి నిర్ణయాలు తీసుకోవచ్చు. వీటిపై ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. బంగారం ధర పెరుగుతుందనో, తగ్గుతుందనో ఊహించడమంటే అదొక లాటరీగానే భావించాలి. మార్కెట్ విశ్లేషకుల అంచనా కూడా ఇదే. కొందరైతే సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని విశ్లేషణలు గమనిస్తే కిలో బంగారం ఖరీదు బాగా తగ్గుతుందంటున్నారు. కనుక అంతవరకు ఆగితేమంచిదని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ తగ్గితే ఆడవారికి ఊరటే. మరో పక్కన ఆకాశం పైకెగురుతున్న ధర నేలచూపులు చూసే అవకాశమే ఉందని, అంతర్జాతీయ స్థాయిలో మార్పులు వస్తే తగ్గడం ఖాయమంటున్నారు. ప్రధానంగా దుబాయ్ వంటి అరబ్ దేశాలలో, భారతదేశంలో మహిళలు బంగారాన్ని ఆభరణాలుగా చేయించుకుని ధరించేందుకు మోజు పడ తారు. అలా బంగారాన్ని దాచుకున్న వాళ్ళకి ఇప్పుడు అనూహ్యంగా ధనం వచ్చి చేరినట్లే. ఎందుకంటే కాస్త బంగారం ఉన్నా ప్రత్యామ్నాయ పెట్టుబడులకు ఉపయోగపడుతున్నాయి. వాటిపై బ్యాంకు రుణాలిస్తున్నాయి. మానవారి అవసరాలు తీరుతున్నాయి. ఏదైనా వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టాలన్నా వారిని బంగారమే నిలబడుతోంది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్ చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబ డులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమం లోనే గోల్డ్ వెండికి గిరాకీ విపరీతంగా ఉంటోందని విశ్లేషణలు వస్తున్నాయి. భౌతిక రాజకీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల కారణంతో ఈ ఏడాది ఇంతవరకు బంగారం ధర 67 శాతం పెరిగింది. మార్కెట్ అనిశ్చితులు ఇలాగే ఉంటే బంగారం మోజు తగ్గించుకోవడమే శ్రేయస్కరం. ఒకప్పుడు షేర్ మార్కెట్ మీద ఇలాంటి అంచనాలతో జనం పెట్టుబడిపెట్టేవారు. అలా పెట్టుబడి పెట్టి మోసపోయిన వారూ ఉన్నారు. కాబట్టి ఈ పెరుగుదలతో ఆనందపడరాదు. మోసపోరాదు.

## మన మహిళల వద్ద 24 నుంచి

# 25వేల టన్నుల బంగారం

**నెటిజన్ పోస్ట్‌పై స్పందించిన ఆనంద్ మహీంద్రా**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** కొన్ని రోజులుగా భారత్‌లో బంగారం వార్తలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భారత ప్రజలకు మరీ ముఖ్యంగా మహిళలకు పసిడి అంటే మక్కువ ఎక్కువ. వారివద్ద 24వేల నుంచి 25వేల టన్నుల బంగారం ఉందని, అది అమెరికా, జర్మనీ వంటి దేశాల వద్ద ఉన్న పుత్తడి కంటే ఎంతో ఎక్కువ అని ఓ నెటిజన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మంచి ఉద్దేశంతో పాటు ఆలోచింపజేసేలా ఉండే సందేశాలను ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. తాజాగా చిన్ననాటి అనుభవాన్ని నెటిజన్లతో పంచుకున్నారు. భారత ప్రజల ఐక్యతను ప్రతిబింబించిన సందర్భాన్ని వెల్లడించారు. ఓ నెటిజన్ వేసిన అంచనాకు సంబంధించి ఆనంద్ మహీంద్రా స్పందించారు. 'ఆకట్టుకునే గణాంకాలు' అంటూ బదులిచ్చిన ఆయన.. ఈ గణాంకాలు 60 ఏళ్ల క్రితం దేశ ప్రజల సాటిలేని దాతృత్వాన్ని గుర్తుచేస్తున్నాయి. 1962లో చైనాతో యుద్ధం నడుస్తోంది. అందుకు కావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ డిఫెన్స్ ఫండ్‌ను ఏర్పాటుచేసి, దేశ రక్షణ చర్యల కోసం బంగారం, ఆభరణాలు విరాళంగా ఇవ్వాలని పౌరులను కోరింది. ఈనాటి ధరల ప్రకారం వేల కోట్ల రూపాయల విలువైన పుత్తడిని సేకరించారు. ఒక్క పంజాబ్ నుంచే 252 కిలోల బంగారం విరాళంగా అందిందట. అప్పుడు నా వయసు ఏడు సంవత్సరాలు. ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరుతూ కొన్ని ప్రభుత్వ ట్రక్కులు ముంబయి వీధుల్లో తిరుగుతున్నాయి. అప్పుడు నేను మా అమ్మతో కలిసి బయటే నిలబడి ఉన్నాను. ఆ పిలుపు విన్న నా తల్లి బంగారు గాజులు, హారాలను ఒక గుడ్డలో చుట్టి ట్రక్కులోని వాలంటీర్లకు అందించింది. ఎంతో నిశ్శబ్దంగా తనకు ఉన్నంతలో దాతృత్వాన్ని చాటుకుంది. ఆ దృశ్యం నా మనసులో అలా ముద్రించుకు పోయింది. ఆ స్థాయిలో స్వచ్ఛంద ఉదారతను చాటుకునే సందర్భం మరొకటి ఉంటుందా..? అని అప్పుడప్పుడు ఆశ్చర్యం వేస్తుంటు ంది. దేశం ఎలాంటి పరిస్థితుల్లోనైనా తట్టుకొని నిలబడగలిగే సామర్థ్యం విధానపరమైన చర్యలపై మాత్రమే గాకుండా ప్రజల సమష్టి సంకల్పంపైనా ఆధారపడి ఉంటుంది. అందుకు ఇదొక ఉదాహరణ అని మహీంద్రా వెల్లడించారు. ఈ విరాళాలు దేశ భక్తిని చాటుకున్న సందర్భం మాత్రమే కాదని దేశ ప్రజల ఐక్యత, విశ్వాసానికి చిహ్నమని రాసుకొచ్చారు. ఇటీవల కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారం నిల్వలు పెంచుకుంటోంది. ఆ నిల్వల మొత్తం 880 మెట్రిక్ టన్నులు దాటేసింది. గత నెల 26వ తేదీ నాటికి ఈ బంగారం విలువ 95.02 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.36 లక్షల కోట్లు). ఆర్‌బీఐ వద్ద ఉన్న 700.24 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు ద్రవ్యంలో ఈ మొ త్తం 13.5 శాతానికి సమానం. ప్రస్తుతం పది గ్రాముల బంగారం ధర రూ.లక్ష పైనే ఉన్న సంగతి తెలిసిందే. అయితే భారతీయులు ప్రతి సందర్భంలోనూ ఇలా ఐక్యతను చాటుతూ తమవద్ద ఉన్న బంగారాన్ని దేశం కోసం ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

# ఐరాస నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవు

**భారత విదేశాంగ మంత్రి జైశంకర్**



**న్యూఢిల్లీ :** భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఐరాస 80వ వార్షికోత్సవం నేపథ్యంలో పోస్టల్ స్టాంపు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వివాదాల యుగంలో శాంతి అనేది అవసరమని జై శంకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తుందన్నారు. ఈక్రమంలో యూఎన్‌లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవస రమైనప్పటికీ.. యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కరణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారు గానే ఉంటుందని.. అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ.. యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. ఇటీవల మైనారిటీల రక్షణ కు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడేందుకు భారత్ సమర్థమంతమైన చర్యలు తీసుకోవాల ంటూ ఐరాస మానవ హక్కుల కమిషన్ ప్రస్తుత ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. దీనికి భారత్ దీటుగా బదులిచ్చింది. ఆ దేశం జాత్యహంకా రం, క్రమబద్ధమైన వివక్ష, విదేశీయుల పై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావిం చింది. ముందు వాటిని పరిష్కరించుకో వడంపై దృష్టిపెట్టాలని సూచించింది. మరోవైపు.. పహల్గాంలో పౌరులపై జరిగిన ఉగ్రదాడిని ప్రపంచవ్యాప్తంగా ఖండించినప్ప టికీ.. పాకిస్థాన్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. యూఎన్ సమావేశాల్లో పదేపదే కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు భారత్‌పై నిందలు మోపే ప్రయత్నాలు చేస్తుంది. అయితే, భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో జై శంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇక, గురువారం యూఎన్‌లో జరిగిన సమావేశాల్లో పాక్ దౌత్యవేత్తలు ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే, భారత్ వీటిని తీవ్రంగా వ్యతిరేకించింది.



# ఎస్సై అత్యాచారం చేశాడు

**అరచేతిపై డాక్టర్ సూసైడ్ నోట్**

**పుణె:** మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఓ వైద్యురాలి ఆత్మహత్య ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఓ ఎస్సై తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ తన అరచేతిపై సూసైడ్ నోట్ రాసి ఆమె బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీడ్ జిల్లాకు చెందిన వైద్యురాలు సతారాలోని ఫల్టాన్ ప్రాంతంలో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఆమె ఫల్టాన్‌లోని ఓ హోటల్ గదిలో ఉరికి వేలాడుతూ కన్పించారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే మృతురాలి అరచేతిపై ఓ నోట్ రాసి ఉండటాన్ని గుర్తించారు. సతారా పోలీసు విభాగానికి చెందిన ఇద్దరు పోలీసులు గత ఐదు నెలలుగా తనను వేధిస్తున్నారని మృతురాలు ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఎస్సై గోపాల్ బదానే పలుమార్లు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని, మరో పోలీసు ప్రశాంత్ బంకర్ మానసికంగా వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఆరోపణల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఘటనపై మృతురాలి బంధువు ఒకరు జాతీయ మీడియాతో మాట్లాడుతూ మరిన్ని ఆరోపణలు చేశారు. తప్పుడు వైద్య నివేదికలు ఇచ్చేలా బాధితురాలిపై ఉన్నతాధికారులు, పోలీసులు తీవ్రంగా ఒత్తిడి చేసేవారని ఆరోపించారు. నకిలీ పోస్ట్‌మార్టం రిపోర్టులు, రోగులు లేకపోయినా వారితో ఫిట్‌నెస్ రిపోర్టులు ఇచ్చేలా ఆమెపై ఒత్తిడి తెచ్చారన్నారు. దీనిపై ఇప్పటికే ఆమె ఎస్పీ, డీఎస్పీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. దీనిపై మహారాష్ట్ర మహిళా కమిషన్ చీఫ్ రూపాలీ స్పందించారు. దీనిపై దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సతారా ఎస్పీతో మాట్లాడారు. తక్షణమే ఆ ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

## ఉగ్ర నిరోధక చట్టాలను


# దుర్వినియోగం చేస్తున్న పాక్

**: ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 :** ఉగ్రవాద నిరోధక చట్టాలను పాక్ దుర్వినియోగం చేస్తోందని మానవహక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చట్టాలను బలోచ్ ఉద్యమకారుల అణచివేతకు వాడుతోందని ఆరోపించింది. 1997 ఉగ్రవాద నిరోధక చట్టం కింద బలోచ్‌కు చెందిన 32 మందిని పాక్ తన వాచ్‌లిస్ట్‌లో చేర్చడాన్ని తప్పుబట్టింది. వారిలో ప్రత్యేక దేశం కోసం పోరాడే వారిని కూడా చేర్చిందని.. ఇది వారి హక్కులను పూర్తిగా కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమ్నెస్టీ దక్షిణాసియా రీజనల్ డైరెక్టర్ బాబూ రామ్ మాట్లాడుతూ.. ప్రత్యేక దేశం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న బలోచ్ ప్రజలను పాక్ ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తోందన్నారు. దీనివల్ల వారి స్వేచ్ఛ, గోప్యత, ఉద్యమానికి సంబంధించిన ప్రాథమిక హక్కులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. పాక్ తన వాచ్‌లిస్ట్‌లో పలువురు మహిళా బలోచ్ కార్యకర్తల పేర్లను కూడా చేర్చి.. తన హద్దులను దాటిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనివల్ల వారు కఠినమైన పర్యవేక్షణ, ప్రయాణ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వారి బ్యాంకు ఖాతాలు కూడా ఫ్రీజ్ అవుతాయని పేర్కొంది. బలోచ్ ఉద్యమ కారులకు వ్యతిరేకంగా పాక్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం కూడా వారికి లేకుండా ఉండేందుకు ఉగ్రవాద నిరోధక చట్టాలను ఉపయోగిస్తోందని తెలిపింది. పాక్ చేస్తున్న ఇటువంటి కుట్రలను అడ్డుకోవాలంటే అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు అనుగుణంగా ఆ దేశం ఉగ్రవాద నిరోధక చట్టాలను సవరించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. బలోచిస్థాన్ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడం కోసం బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఏర్పడింది. పాక్‌లోని అత్యధిక ఖనిజ నిల్వలున్న ప్రావిన్స్‌గా బలోచిస్థాన్‌ను పేర్కొంటారు. ఇక్కడ చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు తదితర వనరులు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ప్రత్యేక దేశం కోసం బలోచ్ ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారు.

# నేడే నాగుల చవితి పర్వదినం



**హైదరాబాద్, అక్టోబర్ 24 :** హిందూ సంప్రదాయంలో పండగలకు, ఆచారాలకు విశేష ప్రాధాన్యం ఉంది. కార్తీక మాసంలో వచ్చే అనేక పర్వదినాలు, పూజలు ఇందుకు నిదర్శనం. ఇందులో భాగంగా శనివారం వచ్చే నాగులచవితికి గాను పాములకు పాలు పోయడం అన్నదానికి విశేషమైన ప్రాధ్యాన్యత ఉంది. పాములను పూజించడం హిందూ ఆచారంలో ఓ భాగం. అయితే.. దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థి నాడు నాగుల చవితి పండుగను జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో శ్రావణ శుద్ధ పంచమి రోజు కూడా జరపుకుంటారు. కానీ తెలుగు రాష్టాల్లో్ర కార్తీక మాసంలో నాగుల చవితి పండుగ ఆచరిస్తారు. ఈ ఏడాది ఈ నాగుల చవితి ఈ నెల 25న అంటే శనివారం జరుపుకోనున్నారు. వ్యవసాయానికి దన్నుగా పాములు సహాయకారికగా ఉంటాయని ప్రతీతి. ముఖ్యంగా పంటలు నాశనం చేసే ఎలుకలను పాములు పట్టుకుని తింటాయి. ఇలా పాములకు కృతజ్ఞతగా చవితి రోజు పుట్టలో ఆలు పోయడమనే ఆచారం పుట్టిందని అంటారు. ప్రకృతి, జంతువుల పట్ల గౌరవ సూచికంగా కూడా వేడుకను చేసుకుంటారు. నాగ దేవతల పూజకు శుభ ముహూర్తం అంటూ ఏదీ ఉండదు. వేకువ జామున లేచి పుట్టలో పాలు పోయడమే ఆచారంగా వస్తోంది. నాగుల చవితి పండుగ రోజు భక్తులు పుట్టలో ఆవు పాలతో పాటు గుడ్లు వేస్తారు. చలిమిడి, చిమ్మిరి నైవేద్యంగా చేసి నాగదేవతకు సమర్పిస్తారు. అలాగే జంట నాగుల విగ్రహాలకు పాలు, పసుపు, కుంకుమతో అభిషేకం చేస్తారు. మహిళలు సౌభాగ్యం కోసం, సంతానప్రాప్తి కోసం సర్పపూజ చేస్తారు. నాగుల చవితి రోజు నాగదేవతను పూజించడం వల్ల రాహువు గ్రహం యొక్క దుష్ప్రభావాలను తగ్గించుకోవచ్చన్న ప్రచారం కూడా ఉంది. అలాగే కుజ దోషం, కాల సర్ప దోషాలు తొలగిపోతాయని నమ్మకం.

## భారత సంతతి వ్యక్తిపై మూన్‌లైటింగ్ ఆరోపణలు

**కేసు రుజువైతే 15 ఏళ్ల జైలు ఖరారు**

**వాషింగ్టన్, అక్టోబర్ 24 :** భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి అనే వ్యక్తి అమెరికాలో అరెస్టయ్యాడు. మూన్‌లైటింగ్ చేయడమే అతడి అరెస్టుకు కారణం. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. న్యూయార్క్ వాసి అయిన గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్‌ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022 నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఇ మెయిల్‌ల ఆధారంగా గోస్వామి మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ పేర్కొన్నారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరుపరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు.



## మొక్కజొన్న పంటను మద్దతు ధరకు విక్రయించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 2025-26 మార్కెటింగ్ సీజన్ లో మొక్క జొన్న కొనుగోలుకు జిల్లాలో 5 కేంద్రాలు ఏర్పాటు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** 2025-26 మార్కెటింగ్ సీజన్ లో మొక్క జొన్న పంటకు ప్రభుత్వం ప్రతి క్వింటాల్ కు 2 వేల 400 రూపాయలు కనీస మద్దతు ధరను ప్రకటించిందని, మద్దతు ధరకు పంట కొనుగోలుకు పక్కా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1705 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 5456 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాతో, రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయుటకు జిల్లా వ్యాప్తంగా 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా, రైతులు తమ పంటను తడి శాతం 14 శాతం లోపు ఉండేలా చూసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మధిర, ఎర్రుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డ్ లలో, ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ళ మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో, సింగరేణి మండలం మాదారంలో కారేపల్లి సహకార సొసైటీ లో, ముదిగొండలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులందరూ తేమ శాతం 14 శాతం లోపు ఉన్న పంటలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ప్రాథమిక పాఠశాల పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలి

**ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వివి నాయక్**

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో జిల్లాలో ప్రాథమిక పాఠశాల తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు వాంకుడోత్ వెంకన్న నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ విద్యాశాఖ అధికారి అశోక్ కు కార్యాలయంలో ప్రాథమిక పాఠశాల పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా పరివేక్షణ బృందంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం లు నోడల్ అధికారులుగా, ఇద్దరు ఎస్జిటిలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. దీంతోపాటు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస రావు, రామయ్య, అంజయ్య,వీరారెడ్డి,ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీ

**అమరవీరుల త్యాగం మరువలేనిది : ఎస్పీ నారాయణరెడ్డి**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన అమర వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. విధి నిర్వహణలో దేశం కోసం, రాష్ట్రం కోసం అమరులైన పోలీసుల స్ఫూర్తిని, వారి ధైర్య సాహసాలను ఎప్పటికీ మర్చిపోకూడదని తెలిపారు. ఈ వ్యాసరచన పోటీల నిర్వహణ ముఖ్య ఉద్దేశం, ప్రస్తుత పోలీస్ సిబ్బందిలో అమరవీరుల త్యాగనిరతి, దేశభక్తిని మరింతగా పెంపొందించడమే అని పేర్కొన్నారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రతి పోలీస్ సిబ్బంది నిబద్ధతతో అంకితభావంతో పనిచేయాలని, అమర వీరులు చూపిన బాటలో నడవాలని ఆయన తెలిపినారు. ఈ కార్యక్రమం లో డిసిఆర్ బి, డి.ఎస్.పి జానయ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.




## నవాబుపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్, స్క్రీనింగ్ పై అవగాహన

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ పవిత్ర**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** శుక్రవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పవిత్ర అధ్యక్షతన మేఘన కెప్టెన్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి అధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన 110 మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం జరిగింది. జిల్లా ఎన్ సి డి విభాగం అధికారిణి డా. నిరోష మానిటరింగ్ చేయడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు యం.రోహిత్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య అధికారి డా.ప్రవిన్ కుమార్, ఎన్ సి డి కోఆర్డినేటర్ జయరాం, పి హెచ్ ఎన్ బ్యూలా, ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ వైద్యులు, పీహెచ్ సి సిబ్బంది, ఏ.యన్.యం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యసాధన దిశగా విద్యార్థులు రాణించాలి

- సేవా భావం, నైతికత వైద్య విద్యార్థులు అలవర్చుకోవాలి
- ఘనంగా ఎంబిబిఎస్ విద్యార్థులకు వైట్ కోట్ ఉత్సవం
- ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ జయలత






**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** లక్ష్యసాధన దిశగా వైద్య విద్యార్థులు రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని,పవిత్రమైన వైద్య వృత్తికి నైతికత,సేవాభావం ఎంతో ముఖ్యమని సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ జయలత విద్యార్థులకు ఉద్బోధించారు. శుక్రవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జరిగిన ఎంబిబిఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జరిగిన వైట్ కోర్టు సెర్మని ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఎలాంటి స్వార్థ పర, తరతమ భేదాలు లేకుండా వైద్యం చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఆసుపత్రికి వచ్చిన వ్యక్తులు ఏ ప్రాంతం వారు,ఏ హోదా కలవారు,ఏ సామాజిక వర్గానికి చెందిన వారు అన్న విషయాలను పరిగణలోకి తీసుకోకుండా,బేధాభిప్రాయాలు చూపకుండా కేవలం అనారోగ్యానికి గురైన వ్యక్తిగానే భావించి చికిత్స అందించాలని ఆకాంక్షించారు. అనారోగ్యానికి గురైన వారు మన బంధువులు, మిత్రులు,ఆత్మీయులు అయితే చికిత్స ఎలా అందించాలని ఆత్రుత,తపన చెందుతామో అదే భావనతో ఇతరులు ఎవరు ఆసుపత్రికి వచ్చినా అంతే సత్వరంగా,నిస్వార్థంగా సేవలు అందించాలని ఆమె కోరారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే భాగ్యం కేవలం వైద్య వృత్తికే ఉంటుందని వెల్లడించారు. ప్రథమ సంవత్సరం వైద్య విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాన్ని ఎంచుకొని ఒక పేపర్ పై వ్రాసి తాము ఉండే చోట గోడలపై అంటించుకుని ఉదయాన్నే లేవగానే తమ లక్ష్యాన్ని మర్చిపోకుండా ఒకసారి చూసుకోవాలని, తద్వారా లక్ష్యం అనేది ఎప్పుడు మదిలో మెదిలేలా మర్చిపోకుండా ఉంటుందని ఆమె సూచించారు. వైట్ కోట్ వేసుకోవడం అంటేనే స్వచ్ఛతకు, సేవా తత్పరతకు నిదర్శనమని వివరించారు. అనంతరం ప్రథమ సంవత్సరం 150 మంది విద్యార్థులకు వైట్ కోట్ లను ఆయా వైద్య విభాగాల అధిపతులు,ప్రొఫెసర్ లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ లతో కలిసి అందించారు. అనంతరం వైద్య విద్యార్థులచే ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అనాటమీ విభాగం అధిపతి ప్రొఫెసర్, డాక్టర్ మున్న నూరి కృష్ణయ్య ఆధ్వర్యంలో చనిపోయిన మృతదేహాలను ప్రదర్శించి వాటి గురించి డిసెక్షన్ ఏ విధంగా చేయాలో వివరించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాలకు తమ కుటుంబ సభ్యుల మృతదేహాలను అందించిన డాక్టర్ కృష్ణ బంటు అనసూయ దంపతులు, తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా నాగజ్యోతి వ్యవహరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు వైద్య విభాగాల విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు,అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్లు చిన్నం గీత, శ్రీకాంత్, బొల్లంపల్లి బాబురావు, జటావత్ వెంకట దుర్గా శివప్రసాద్,నిషాణం గురు రాజ్,తరుణి,జల్లి పద్మజ, బుక్కె ఆనంద్ కుమార్,పారుపల్లి సతీష్, అరుణ కుమారి, శ్రీకాంత్ బట్, రాధిక, పద్మావతి, జమీమా, ఈశ్వరమ్మ,రఘురామిరెడ్డి, అర్చన, యశ్వంత్, కిరణ్మయి, వివాస్వన్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాతులూరు శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తీగల వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- మున్నేరు కేబుల్ బ్రిడ్జ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పరిశీలన



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఖమ్మం మున్నేరు నదిపై చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, మున్నేరు భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పురోగతి పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు ఇచ్చే ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ల ప్రకారం మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం రెండు వైపులా,సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. నిర్వాసితులకు అందించే 125 ఎకరాల ప్రత్యామ్నాయ భూముల లేఔట్ వెంచర్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, వెంచర్ కు 100 మీటర్ల ప్రధాన రహదారి, 40 మీటర్ల చొప్పున అంతర్గత రహదారి,నగరంకు సులుభతరం చేసే విధంగా అదనంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రత్యేకంగా కల్పించే వసతులతో ఒక ప్రత్యేక వెంచర్ తో భూమి విలువ పెరిగి చుట్టు ప్రక్కల విస్తృతంగా అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. ప్రజలకు అందించే భూములలో లేఔట్ అభివృద్ధి అంతర్గత రోడ్లు,కనెక్టివిటీ అంశాలు ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు. తీగల వంతెన నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్ట పోకుండా,వేగవంతంగా నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీ ఎస్ఇ యాకుబ్, ఇఇ పవార్,ఆర్డీఓ నరసింహారావు,ఇరిగేషన్ డిఇ రమేష్ రెడ్డి, ఖమ్మం అర్బన్,రూరల్ మండల తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.




## డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**డీఎస్పీ నరసింహచారి**

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా జిల్లా నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం నందు విద్యార్థులకు పోలీసు విధులు,విధానాలు వివరించారు. ఆయుధ ప్రదర్శన చేసి సమాజంలో శాంతి భద్రత రక్షణలో ఆయుధాల వినియోగం గురించి తెలియజేశారు. కేసుల దర్యాప్తులో క్లూస్ టీమ్,ఫింగర్ ప్రింట్స్ విభాగం,డాగ్ స్క్వాడ్ విధులు,బాంబ్ స్క్వాడ్ విధులు వివరించారు. మహిళల రక్షణలో షీ టీమ్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు ఈ సందర్భంగా ఏఆర్ డిఎస్పి నరసింహ చారి మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు విద్యార్థులకు పోలీస్ స్టేషన్ ప్రదర్శన చేయడం జరిగినది అన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్టేషన్ ఎస్ ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## వరి పొలాలను సందర్శించిన ఏఓ వాణి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వరి పొలాలు గింజ పాలు పోసుకునే దశ నుండి కోత దశలో ఉన్నాయని కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి తెలిపారు. కూసుమంచి మండలంలోని గైగోళ్ళపల్లి గ్రామంలోని వరి పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పొలాల్లో అక్కడక్కడా కంకి నల్లి ఆశించినట్లు గమనించడం జరిగిందని,దీని నివారణకు స్పైరోమెసిఫిన్ లీటరు నీటికీ ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుత వాతావరణంలో కాటుక తెగులు ఆశించే అవకాశం ఉందని దీని నివారణకు గాను ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి లేదా కార్బెండజిమ్ 50 మందును 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ఈ సంవత్సరం మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మొదలవ్వనున్నాయని,రైతులందరూ వాటిని వినియోగించుకోవాలని వాణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయిరాం,స్థానిక రైతులు,తదితరులు పాల్గొన్నారు.



## పేరూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రం పేరూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవాన్ని, రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. వాజేడు సొసైటీ చైర్మన్ యగ్గిడి అంజయ్య మాట్లాడుతూ...అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని,సన్న వడ్లకు గిట్టుబాటు ధర క్వింటకు 2389రూపాయలతో పాటు 500 రూపాయలు బోనస్ ఇస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని,దళారులను నమ్మి రైతులు మోసపోకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో సత్యనారాయణ, డిసిసిబి బ్యాంకు మేనేజర్ నాగేందర్,జ్యోతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## చేప పిల్లల కోసం కోటి 7 లక్షల కేటాయింపు

**రాష్ట్ర సంవర్ధక, మత్స్య, క్రీడ యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పెను మార్పులు తీసుకువస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య , క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం కోట్ పల్లి ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల ప్రారంభోత్సవ కార్యక్రమానికి తాండూరు శాసనసభ్యులు బి.మనోహర్ రెడ్డి తో కలిసి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కోట్ పల్లి చెరువులో మూడు రకాలతో కూడిన 10 లక్షల పై చీలుకు చేప పిల్లలను వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... ముదిరాజు కుటుంబాలు కులవృత్తిని ఆధారంగా చెరువుల్లో చేపలను పట్టుకొని తమ కుటుంబాలను పోషించుకుంటారన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని సదుద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా పెద్ద ఎత్తున రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువులలో చేప పిల్లలను వదలడం జరుగుతుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు మత్స్యకారులను సరిగ్గా పట్టించుకోలేదని చెరువుల్లో ఎన్ని చేపలను వదిలారో కూడా లెక్కలు లేవని ఆయన అన్నారు. జిల్లాలో ఒక కోటి 29 లక్షల చేప పిల్లలను వదిలేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం జరిగిందని దీనికి కోటి 7 లక్షల రూపాయలను వెచ్చించడం జరుగుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల మత్స్య కారుల కుటుంబాలకు జీవనోపాధి కలిగే విధంగా 123 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. మత్స్యకారులు ఏదైనా ప్రమాదాలకు గురి అయినట్లయితే కోటి 40 లక్షల ఉచిత బీమాకు గాను ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తాండూరు నియోజకవర్గం లో శాసన సభ్యుల సహకారంతో నిర్మాణం చేపట్టడం సంతోషదాయకమని ఇందుకు ఎమ్మెల్యేకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. తాండూరు శాసనసభ్యులు బి. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 120 కోట్ల నిధులను వెచ్చించి ముదిరాజుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యతను తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కోట్ పల్లి ప్రాజెక్టులో ఎన్నడూ లేని విధంగా పది లక్షలకు పైగా చేప పిల్లలను వదలడంతో మత్స్యకారులకు ఆదయపరంగా లబ్ధి చేకూర్చే విధంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ కార్పోషన్ చైర్మన్ మట్టి సాయి కుమార్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, స్పోర్ట్స్ చైర్మన్ శివా రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, మత్స్య శాఖ అదనపు సంచాలకులు శ్రీనివాస్, ఏడి వెంకన్న, ఆర్డిఓ వాసుచంద్ర, జిల్లా పశుసంవర్ధక అధికారి సదానందం, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ డానియల్, ముదిరాజ్ సంఘం జిల్లా ఇంచార్జ్ శ్రీధర్ బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు.



## అనారోగ్యంతో విద్యార్థిని మృతి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని గంధం నవ్య అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచింది. నవ్య పార్థివదేహానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సందర్శించి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నవ్య తల్లిదండ్రులకు పాఠశాల తరఫున పదివేల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుల సస్పెన్షన్ హర్షణీయం

- పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విద్యార్థుల భవిష్యత్ ను గాలికి వదిలేసి,బయట చక్కర్లు కొడుతూ అడ్డంగా బుక్కైన తిరుమలాయపాలెం మండలంలోని ఎర్రగడ్డ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూక్య కేశ్యాను జిల్లా విద్యాధికారిణి(డిఈఓ) డా.శ్రీజ విధుల నుండి సస్పెండ్ చేయడం హర్షణీయమని పిడిఎస్ యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ప్రధానోపాధ్యాయుడుగా అనుభవం కలిగిన కేశ్యా పలుమార్లు పాఠశాల విధులకు హాజరైనట్లుగా ఎఫ్ఆర్ఎస్ యాప్ లో హాజరు వేసుకుని,అనుమతి లేకుండా బయట తిరుగుతూ రాజకీయ పార్టీల సమావేశంలో పాల్గొనడం సరైంది కాదన్నారు. అదే విధంగా కూసుమంచి మండలంలోని నరసింహులగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారి విద్యార్థినీలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వికృత చేష్టలతో లైంగిక వేదింపులకి పాల్పడిన ఉపాధ్యాయుడు జి.వీరయ్య ను సస్పెండ్ చేసి,ఫోక్సో కేసు నమోదు చేయడం సంతోష దాయకం అని తెలిపారు. ఉపాధ్యాయుల పై వచ్చిన ఆరోపణల పై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి సస్పెన్షన్ వేటు పడేలా కృషి చేసిన జిల్లా విద్యాధికారిణి డా.శ్రీజ కి మస్తాన్ అభినందనలు తెలియజేశారు.



## రష్యాపై ఆంక్షల ఎఫెక్ట్..

### భారీగా పెరిగిన సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు

**రష్యా :** రష్యా ప్రధాన చమురు సంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ముడిచమురు కొనుగోలుదారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో చమురు రవాణా చేసే సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు అమాంతం పెరగడం గమనార్హం. మధ్య ప్రాచ్యం-చైనా మార్గంలో ఈ ట్యాంకర్ల ఛార్జీలు ఒక్కరోజే 16 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. పుతిన్ అనుచితంగా చేస్తున్న యుద్ధానికి ప్రతిగా రష్యాలోని అతి పెద్ద చమురు కంపెనీలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌లపై ఆంక్షలను విధిస్తున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ బుధవారం ప్రకటించారు. దీంతో ఈ సంస్థల నుంచి ప్రధానంగా చమురు కొనుగోళ్లు జరుపుతోన్న భారత, చైనీస్ రిఫైనరీలు అప్రమత్తమయ్యాయి. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించుకోవాలని ఈ కంపెనీలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో డిమాండ్‌కు అనుగుణంగా చమురు దిగుమతి కోసం మధ్యప్రాచ్యం వైపు చూస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యం-చైనా మార్గంలో త్వరలో ముగియనున్న ఫ్రీట్ అగ్రిమెంట్‌లకు సంబంధించి సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు గురువారం 16శాతం పెరిగినట్లు బాల్టిక్ ఎక్స్ఛేంజ్ డేటా వెల్లడించింది. ట్యాంకర్ల ఛార్జీలు ఈ స్థాయిలోకి రావడం 2023 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. డిసెంబరు కాంట్రాక్టులకు సంబంధించిన ఛార్జీలు కూడా దాదాపు 13శాతం పెరిగినట్లు తెలుస్తోంది. రష్యా కంపెనీలు, వాటికి అనుబంధంగా పని చేసే డజన్ల కొద్దీ కంపెనీలపైనా ఆంక్షలు అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. అటు ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఇవన్నీ నవంబరు 21వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే అవకాశముంది. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ డేటా ప్రకారం.. రష్యా ఆగస్టులో ప్రతి రోజు 7.3 మిలియన్ బ్యారెళ్ల ఇంధనాన్ని ఎగుమతి చేసింది. ప్రపంచ ముడిచమురు, రిఫైన్డ్ ఇంధన వినియోగంలో ఇది దాదాపు 7శాతానికి సమానం కావడం గమనార్హం.



## మూన్‌లైటింగ్ ఆరోపణలు..

### అమెరికాలో భారతీయుడికి 15 ఏళ్ల జైలు శిక్ష

**యూఎస్ :** భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి అనే వ్యక్తి అమెరికాలో అరెస్టయ్యాడు. మూన్‌లైటింగ్ చేయడమే అతడి అరెస్టుకు కారణం. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. అసలేం జరిగిందంటే.. న్యూయార్క్ వాసి అయిన గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్‌ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022 నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఇ మెయిల్‌ల ఆధారంగా గోస్వామి మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ పేర్కొన్నారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరుపరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు. అయితే, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఇందులో నేరం రుజువైతే అతడికి 15 ఏళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇక, గోస్వామి అరెస్టు నేపథ్యంలో మూన్‌లైటింగ్ గురించి మరోసారి చర్చ జరుగుతుంది.



## ఫ్రాన్స్‌లోని మరో మ్యూజియంలో దోపిడీ

**ఫ్రాన్స్ :** ఫ్రాన్స్‌లో ప్రఖ్యాత లావ్రే మ్యూజియంలో చోరీ ఘటన యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే ఫ్రాన్స్‌లో మరో మ్యూజియంలో దోపిడీ జరిగింది. ఈ ఘటనలో 2వేల బంగారు, వెండి నాణేలు అపహరణకు గురయ్యాయి. ది మైసన్ డెస్ లుమైరేస్ అనే మ్యూజియంలో దోపిడీ జరిగింది. లావ్రే మ్యూజియంలో చోరీ జరిగిన కొన్ని గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం మ్యూజియం సిబ్బంది తలుపులు తెరిచేసరికి.. అక్కడ ప్రదర్శన అద్దాలు పగిలిఉండటాన్ని గుర్తించారు. దీంతో వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. అపహరణకు గురైన 2,000 వెండి, బంగారం నాణేలను 2011లో ప్రస్తుత మ్యూజియం ఉన్న భవనం పునరుద్ధరణ సమయంలో కనుగొన్నారు. అవి 1790, 1840 మధ్య నాటివని స్థానిక మీడియా పేర్కొంది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇక, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మోనాలిసా అసలు చిత్రం ఉన్న లావ్రే మ్యూజియంలో ఆదివారం చోరీ జరిగిన సంగతి తెలిసిందే. ఇక్కడ దొంగిలించిన నగల విలువ దాదాపు రూ.895 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మ్యూజియంలో నిఘా కెమెరా పనితీరు సరిగ్గా లేదని డైరెక్టర్ లారెన్స్ డెస్ కార్స్ అంగీకరించారు. ఈ దోపిడీకి పాల్పడింది ఎవరనేది ఇప్పటివరకు తెలియలేదు. అయితే, కరుడుగట్టిన దొంగల ముఠా పింక్ పాంథర్స్ పని అయి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

# పాకిస్థాన్‌లో కిలో టమాటా

# ₹600

**అఫ్గాన్-పాక్ బోర్డర్ మూసివేత ఎఫెక్ట్..**



**పాకిస్థాన్ :** పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొనడంతో అక్టోబర్ 11 నుంచి ఇరుదేశాల సరిహద్దులను మూసివేశారు. దీంతో పాక్- అఫ్గాన్ ప్రజలపై తీవ్ర ప్రభావం పడింది. బోర్డర్ మూసివేత వల్ల ఇరుదేశాల్లో పండ్లు, కూరగాయలు, ఖనిజాలు, ఔషధాలు, గోధుమలు, బియ్యం, చక్కెర, మాంసం, పాల ఉత్పత్తులు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఘర్షణలకు ముందుతో పోలిస్తే పాక్‌లో టమాటా ధరలు ఐదు రెట్లు పెరిగినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కిలో టమాటాల ధర 600 పాకిస్థానీ రూపాయలు ఉన్నట్లు తెలుస్తోంది. అఫ్గాన్ నుంచి అధికంగా దిగుమతి చేసుకునే ఆపిల్ ధరలు కూడా భారీగా పెరిగినట్లు సమాచారం. సాధారణంగా పాక్- అఫ్గాన్ సరిహద్దు నుంచి ఏటా ఇరుదేశాల మధ్య 2.3 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని.. ఇరుదేశాల మధ్య ఘర్షణలు చెలరేగడంతో బోర్డర్లలో వాణిజ్య, రవాణా సదుపాయాలు పూర్తిగా నిలిపివేశామని కాబుల్‌లోని పాక్-అఫ్గాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధిపతి ఖాన్ జాన్ అలోకోజాయ్ వెల్లడించారు. దీనివల్ల రోజుకు ఇరువైపులా దాదాపు 1 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8 కోట్లు) నష్టం వాటిల్లుతు ఒదన్నారు. అఫ్గాన్ నుంచి పాక్‌కు సరఫరా చేసే దాదాపు 5 కంటైనర్ల కురగాయలు పాడైనట్లు తెలిపారు. సరిహద్దుకు ఇరువైపులా దాదాపు 5వేల కంటైనర్లు నిలిచిపోయాయని పాకిస్థాన్‌లోని ప్రధాన టోరామ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద ఉన్న ఓ అధికారి పేర్కొన్నట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. గత కొన్ని రోజులుగా రెండు దేశాల సరిహద్దు ల్లో తీవ్ర ఘర్షణలు, దాడులు జరిగి పలువురు సైనికులు, పౌరులు, ఉగ్రవాదులు మరణించారు. ఈ నేపథ్యంలో గత వారం ఖతార్‌లోని దోహాలో పాక్, అఫ్గాన్ రక్షణ మంత్రులు ఖ్వాజా ఆసిఫ్, ముల్లా యాకుబ్‌ల మధ్య చర్చలు జరిగాయి. ఇందులోభాగంగా ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయి. అయితే సరిహద్దు వాణిజ్యం మాత్రం ఇంకా తెరుచుకోలేదు. ఇరుదేశాల మధ్య తదుపరి రౌండ్ చర్చలు అక్టోబర్ 25న ఇస్తాంబుల్‌లో జరగనున్నాయి.

## ఆరు నెలల్లో ఆంక్షల తీవ్రత తెలుస్తుంది

### రష్యాకు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్ :** ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ఆంక్షల ఒత్తిడికి తలొగ్గేది లేదంటూ ఆ దేశాధ్యక్షుడు పుతిన్ గట్టిగా బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా స్పందించిన ట్రంప్.. పుతిన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. ఆంక్షల విధింపు స్నేహపూర్వక చర్య కాదని పుతిన్ భావించడం తనకు సంతోషంగా ఉందంటూ విలేకరులతో పేర్కొన్నారు. తమ చర్యల తీవ్రత ఏంటో ఆరు నెలల్లో వారికి అర్థమవుతుందన్నారు. ఇదంతా ఎలా జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు. ఈ ఆంక్షల విధింపు సముచితమని, అవసరమని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో ట్రంప్ పలుమార్లు హెచ్చరికలు కూడా చేశారని, ఇప్పుడు అవి అమలు చేశారన్నారు. యుద్ధం ముగింపు విషయంలో పుతిన్ తీరుపై ట్రంప్ గత కొంతకాలంగా నిరాశతో ఉన్నారన్నారు. శాంతి దిశగా ముందుకుసాగేందుకు రష్యా ఆసక్తి చూపకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. పుతిన్-ట్రంప్‌ల భేటీ గురించి ఇప్పుడే ఏం చెప్పలేమన్న ఆమె.. ఈ సమావేశంలో సానుకూల స్పందన రావాలని యూఎస్ కోరుకుంటుందన్నారు. రష్యా అధ్యక్షుడితో జరిగే సమావేశం వల్ల తన సమయం సద్వినియోగం అవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆయన మాటలకు కాకుండా.. చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నారని వెల్లడించారు. పదవీకాలం చేపట్టినప్పటి నుంచి ఈ యుద్ధం ముగించేందుకే కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు సంస్థలపై ట్రంప్ ఆంక్షలు విధించారు. ఈయూ కూడా ఆ దేశంపై మరిన్ని ఆర్థిక ఆంక్షలు విధించింది. అయితే, ఇవన్నీ తమపై ఒత్తిడి తెచ్చేందుకేనని, ఆత్మగౌరవమున్న ఏ దేశమూ ఇలాంటి వాటికి తలొగ్గబోదని పుతిన్ పేర్కొన్నారు. ఇది అమెరికా వినియోగదారులపై కూడా ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

## ఆనాడు మా అమ్మ మౌనంగా తీసిచ్చిన బంగారం

## నాకింకా గుర్తే : ఆనంద్ మహీంద్రా



**ముంబాయి :** మంచి ఉద్దేశంతో పాటు ఆలోచింపజేసేలా ఉండే సందేశాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా. తాజాగా చిన్ననాటి అనుభవాన్ని నెటిజన్లతో పంచుకున్నారు. భారత ప్రజల ఐక్యతను ప్రతిబింబించిన సందర్భాన్ని వెల్లడించారు. కొన్ని రోజులుగా భారత్‌లో బంగారం వార్తలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భారత ప్రజలకు మరీ ముఖ్యంగా మహిళలకు పసిడి అంటే మక్కువ ఎక్కువ. వారివద్ద 24వేల నుంచి 25వేల టన్నుల బంగారం ఉందని, అది అమెరికా, జర్మనీ వంటి దేశాల వద్ద ఉన్న పుత్తడి కంటే ఎంతో ఎక్కువ అని ఓ నెటిజన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దానికి ఆనంద్ మహీంద్రా స్పందించారు. 'ఆకట్టుకునే గణాంకాలు' అంటూ బదులిచ్చిన ఆయన.. ఈ గణాంకాలు 60 ఏళ్ల క్రితం దేశ ప్రజల సాటిలేని దాతృత్వాన్ని గుర్తుచేస్తున్నాయి. "1962లో చైనాతో యుద్ధం నడుస్తోంది. అందుకు కావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ డిఫెన్స్ ఫండ్‌ను ఏర్పాటుచేసి, దేశ రక్షణ చర్యల కోసం బంగారం, ఆభరణాలు విరాళంగా ఇవ్వాలని పౌరులను కోరింది. ఈనాటి ధరల ప్రకారం వేల కోట్ల రూపాయల విలువైన పుత్తడిని సేకరించారు. ఒక్క పంజాబ్ నుంచే 252 కిలోల బంగారం విరాళంగా అందిందట. అప్పుడు నా వయసు ఏడు సంవత్సరాలు. ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరుతూ కొన్ని ప్రభుత్వ ట్రక్కులు ముంబయి వీధుల్లో తిరుగుతున్నాయి. అప్పుడు నేను మా అమ్మతో కలిసి బయటే నిలబడి ఉన్నాను. ఆ పిలుపు విన్న నా తల్లి బంగారు గాజులు, హారాలను ఒక గుడ్డలో చుట్టి ట్రక్కులోని వాలంటీర్లకు అందించింది. ఎంతో నిశ్శబ్దంగా తనకు ఉన్నంతలో దాతృత్వాన్ని చాటుకుంది. ఆ దృశ్యం నా మనసులో అలా ముద్రించుకుపోయింది. ఆ స్థాయిలో స్వచ్ఛంద ఉదారతను చాటుకునే సందర్భం మరొకటి ఉంటుందా..? అని అప్పుడప్పుడు ఆశ్చర్యం వేస్తుంటుంది. దేశం ఎలాంటి పరిస్థితుల్లోనైనా తట్టుకొని నిలబడగలిగే సామర్థ్యం విధానపరమైన చర్యలపై మాత్రమే గాకుండా ప్రజల సమష్టి సంకల్పం పైనా ఆధారపడి ఉంటుంది. అందుకు ఇదొక ఉదాహరణ" అని మహీంద్రా వెల్లడించారు. ఈ విరాళాలు దేశభక్తిని చాటుకున్న సందర్భం మాత్రమే కాదని దేశ ప్రజల ఐక్యత, విశ్వాసానికి చిహ్నమని రాసుకొచ్చారు. ఇటీవల కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారం నిల్వలు పెంచుకుంటోంది. ఆ నిల్వల మొత్తం 880 మెట్రిక్ టన్నులు దాటేసింది. గత నెల 26వ తేదీ నాటికి ఈ బంగారం విలువ 95.02 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.36 లక్షల కోట్లు). ఆర్‌బీఐ వద్ద ఉన్న 700.24 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు ద్రవ్యంలో ఈ మొత్తం 13.5 శాతానికి సమానం. ప్రస్తుతం పది గ్రాముల బంగారం ధర రూ.లక్ష పైనే ఉన్న సంగతి తెలిసిందే.

## దిల్లీలో ఆత్మాహుతి దాడికి ప్లాన్.. భగ్నం చేసిన అధికారులు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి ప్లాన్ చేయగా.. పోలీసులు దాన్ని భగ్నం చేశారు. ఈ క్రమంలో ఐఎస్ఐఎస్‌తో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. నిఘా సమాచారం ఆధారంగా దిల్లీలోని సాదిక్ నగర్, భోపాల్‌లలో దిల్లీ సూపర్ సెల్ పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో ఆత్మాహుతి దాడులకు శిక్షణ పొందుతున్న ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరు భోపాల్‌కు చెందిన అద్నాన్ కాగా.. మరొకరు మధ్యప్రదేశ్‌కు చెందినవారు. నిందితులకు ఐసిస్‌తో సంబంధాలు ఉన్నాయని, దిల్లీలో ఓ పెద్ద ఆత్మాహుతి దాడికి ప్లాన్ చేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని సీనియర్ అధికారి తెలిపారు. వారి నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పలు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి మరింత సమాచారం తెలుసుకునేందుకు విచారిస్తున్నామన్నారు. వీరి మొత్తం నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందన్నారు.



## వాణిజ్య చర్చలు నిలిపివేసిన ట్రంప్

### టారిఫ్ యాడ్స్ ఎఫెక్ట్..

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాతో నడుస్తోన్న వాణిజ్య చర్చలను నిలిపివేశారు. యూఎస్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ ఆ దేశం ఇచ్చిన ప్రకటనలే అగ్రరాజ్య అధ్యక్షుడి ఆగ్రహానికి కారణమైంది. ఇది దారుణమైన ప్రవర్తన అని సోషల్‌మీడియాలో ట్రంప్ పోస్ట్ పెట్టారు. "అమెరికా జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థకు సుంకాలు చాలా ముఖ్యం. వారు దారుణమైన ప్రవర్తన కారణంగా కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దు చేసుకుంటున్నాం" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రీమియర్ డగ్‌ఫోర్డ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "ఒంటారియో కొత్త ప్రకటన ప్రచారం ప్రారంభించింది. మాపై అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా మా ప్రచారాన్ని కొనసాగిస్తాం. అందుబాటులో ఉన్న ప్రతీ సాధనాన్ని ఉపయోగిస్తాం. కలిసి పనిచేయడమే ఇరువర్గాల శ్రేయస్సుకు మంచి మార్గం" అని రాసుకొచ్చారు. మరోవైపు, అమెరికాలో సుంకాలతో ముప్పు పొంచి ఉన్నందున ఆ దేశాన్ని దాటి మిగతా దేశాలతో ఎగుమతులు పెంచుకోవాలనుకుంటున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ట్రంప్ మండిపడ్డారు. వాణిజ్య చర్చల నిలిపివేతపై ప్రకటన చేశారు. కెనడా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 35 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా రంగాలవారీగా సుంకాలను ప్రకటించారు. అమెరికా-మెక్సికో-కెనడా అగ్రిమెంట్ కింద కవర్ అయిన వస్తువులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ టారిఫ్‌ల ప్రకటన తర్వాత నుంచి అమెరికా-కెనడాల మధ్య మాటల యుద్ధం నడిచింది. రెండు దేశాల సంబంధాలు ఒత్తిడికి గురయ్యాయి. అయితే కొన్ని రోజుల క్రితం ట్రంప్‌తో కెనడా ప్రధాని మార్క్ కార్నీ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా జరిగిన చర్చల వల్ల ఎలాంటి ఫలితం లేదని తాజాగా వెల్లడైంది. కాగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల నాటినుంచే కెనడా 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని కెనడా సర్కారు ఖండిస్తూ వస్తోంది. తమ దేశం అమ్మకానికి లేదంటూ గట్టిగా చెప్పింది. ఈ క్రమంలోనే అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగుదేశంపై ట్రంప్ సుంకాలతో విరుచుకుపడ్డారు. ప్రతిగా కెనడా కూడా టారిఫ్‌లు విధించింది.




## హెచ్-1బీ వీసాలు.. అమెరికన్ల వేతనాలు

## తగ్గించేస్తున్నాయి : వైట్‌హౌస్

**వాషింగ్టన్:** హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా.. కోర్టుల్లో పిటీషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందించారు. ఈ హెచ్-1బీ వీసా వ్యవస్థల్లో మోసాలు జరుగుతున్నాయన్నారు. 'ఈ వ్యాజ్యాలపై కోర్టులో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం. అమెరికన్ కార్మికులకు అవకాశాలు అందడంతో పాటు వీసా వ్యవస్థను బలోపేతం చేయడమే అధ్యక్షుడు ట్రంప్ తొలి ప్రాధాన్యం. చాలాకాలంగా హెచ్-1బీ వీసా వ్యవస్థ మోసాలతో నిండి ఉంది. అది అమెరికన్ల వేతనాలను తగ్గించింది. కాబట్టి ట్రంప్ ఈ వ్యవస్థను మెరుగుపరచాలనుకుంటున్నారు. ఈ చర్యలు చట్టబద్ధమైనవి. దీనిపై కోర్టులో పోరాడేందుకు సిద్ధం' అని ఆమె పేర్కొన్నారు. హెచ్-1బీపై ట్రంప్ నిర్ణయాన్ని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయం కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను ఇది దెబ్బతీస్తోందని ఆ గ్రూప్ ఆందోళన వ్యక్తం చేసింది. హెచ్-1బీపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని తన వ్యాజ్యంలో వాదించింది. ఇక పలు ఉద్యోగ సంఘాలు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ఆయనకు లేఖ కూడా రాశారు. ట్రంప్ నిర్ణయం యూఎస్ కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నైపుణ్యం కలిగిన వలసదారులను కోల్పోవాల్సి ఉంటుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు.



## తమిళనాడులో ఎస్ఐఆర్ : ఈసీ వెల్లడి


**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తమిళనాడులోనూ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఒక వారంలో ఎస్ఐఆర్ ప్రారంభం అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం మద్రాస్ హైకోర్టుకు తెలిపింది. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ శాసనసభలకు 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఇది వరకే వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న బిహార్‌లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది. 22 ఏళ్ల విరామం తర్వాత అక్కడ ఈ సవరణ చేపట్టారు. దానిపై విపక్షాలు విమర్శలు చేశాయి. ఎస్ఐఆర్ పేరుతో బిహార్‌లో పెద్ద ఎత్తున ఎన్నికల రిగ్గింగ్ జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈసీ ఉద్దేశపూర్వకంగా ఓటర్లను తొలగిస్తోందని ఆ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు హస్తం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడిన సంగతి తెలిసిందే.

# ఆరు రోజుల వరుస లాభాలకు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడిదారుల విక్రయాలు, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల వంటివి ప్రభావం చూపాయి. దీంతో ఆరు రోజుల వరుస లాభాలకు బ్రేక్‌పడింది. సెన్సెక్స్ 340 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 96 పాయింట్ల మేర క్షీణించింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65.92 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4066 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఈ ఉదయం 84,667.23 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. తర్వాత నష్టాల బాట పట్టింది. చివరకు 344.52 పాయింట్లు నష్టపోయి 84,211.88 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ 96.25 పాయింట్ల నష్టంతో 25,795.15కి చేరింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.83గా ఉంది. సెన్సెక్స్ 30లో ప్రధానంగా హిందుస్థాన్ యునిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, టైటాన్, కొటక్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, బీఈఎల్, సన్ ఫార్మా, ఐటీసీ షేర్లు లాభపడ్డాయి.





## వాట్సప్ చాట్ విండోలోనే ఇక స్టోరేజ్ మేనేజ్‌మెంట్

మెటాకు చెందిన ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ తమ యూజర్లకు స్టోరేజ్ మేనేజ్‌మెంట్‌ను మరింత సులభం చేయనుంది. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు యాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లకుండా చాట్ విండో నుంచే తమ డివైజ్ స్టోరేజ్‌ను చెక్ చేసుకోవచ్చు. అవసరమైతే క్లియర్ చేసుకోవచ్చు. దీంతో వాట్సప్‌లో ఎక్కువ స్టోరేజ్‌ను ఆక్రమిస్తున్న ఫైల్స్ ఏవో త్వరగా గుర్తించి తొలగించే వీలుంటుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ టెస్టింగ్ దశలో ఉందని వాబీటా తన బ్లాగ్ పోస్ట్‌లో తెలిపింది. త్వరలో అందరికీ అందుబాటులోకి రానుందని సమాచారం. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు వివిధ చాట్లలో షేర్ చేసిన ఫైల్స్ జాబితాను వాటి సైజ్ ఆధారంగా చూడొచ్చు. అవసరం లేని ఫైల్స్ డిలీట్ చేసి స్టోరేజ్ ఖాళీ చేసుకోవచ్చు. బల్క్ డిలీషన్ సపోర్ట్ కూడా ఉంది. అంటే ఒకేసారి చాలా అనవసర ఫైళ్లను ఎంచుకొని తొలగించే వీలుంటుంది. కావాల్సిన ఫైళ్లకు స్టార్ మార్క్ ఇచ్చి పొరపాటున డిలీట్ కాకుండా కాపాడుకోవచ్చు. అలాగే అవసరమైన ఫైళ్లను పిన్ చేసి స్టోరేజ్ స్క్రీన్ టాప్‌లో ఉంచుకునే సదుపాయమూ అందించనుంది. ఈ షార్ట్‌కట్ ప్రస్తుతం డెవలప్‌మెంట్ దశలో ఉందని, గూగుల్ ప్లే బీటా ప్రోగ్రాం ద్వారా రిజిస్టర్ చేసుకున్న యూజర్లకు ప్రస్తుతం అందుబాటులో ఉందని వాబీటా తెలిపింది.



## ఒక బ్యాటర్‌ను తగ్గించైనా కుల్‌దీప్‌ను తీసుకోవాల్సింది

### మాజీ క్రికెటర్ వరుణ్ ఆరోన్

పెర్త్ వన్డేలో ఓటమి చవిచూసిన టీమ్‌ఇండియా అడిలైడ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ పరాజయం పాలైంది. భారత జట్టు దాదాపు 17 సంవత్సరాల తర్వాత ఈ వేదికగా జరిగిన వన్డే మ్యాచ్‌లో ఓడిపోయింది. రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ బ్యాటింగ్‌లో రాణించినప్పటికీ.. బౌలింగ్, ఫీల్డింగ్‌లో లోపాల వల్ల భారత జట్టు విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా నిర్దేశించిన 265 పరుగుల లక్ష్యాన్ని.. ఆసీస్ జట్టు 8 వికెట్లు కోల్పోయి 22 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. మొదటి రెండు వన్డేల్లోనూ కుల్‌దీప్ యాదవ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. అయితే అతడికి తుది జట్టులో కచ్చితంగా చోటు కల్పించాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ వరుణ్ ఆరోన్ అభిప్రాయపడ్డాడు. 'టీమ్‌లో ఒక బ్యాటర్‌ను తగ్గించైనా కుల్‌దీప్‌యాదవ్‌ను జట్టులోకి తీసుకోవాల్సింది. అతడు వికెట్ టేకింగ్ బౌలర్. జట్టులో ఒక బ్యాటర్‌ను తగ్గిస్తే.. తమ వెనక రన్స్ చేసే వారు లేరని, మిగతా బ్యాటర్లు మరింత బాధ్యతాయుతంగా ఆడేందుకు ప్రయత్నిస్తారని నా అభిప్రాయం' అని అతడు అన్నాడు. 'టీమ్‌ఇండియా మొదటి నుంచీ ఏడుగురు బ్యాటర్లతో ఆడలేదు. జట్టులోకి కుల్‌దీప్‌ను తీసుకుంటే.. అతడు కచ్చితంగా వికెట్లను కూల్చగలడు. భారత జట్టు ప్రత్యర్థి వికెట్లు తీసుకోవడం కంటే కూడా.. ఆ బ్యాటర్లు పొరపాటు చేసి వికెట్లు కోల్పోవాలని చూసింది. ఈ విషయం భారతజట్టు ఆటతీరు చూస్తేనే అర్థమైంది' అని వరుణ్ ఆరోన్ కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. టీమ్‌ఇండియా మొదటి రెండు మ్యాచుల్లో ఓడిపోవడంతో.. మూడు వన్డేల సిరీస్‌ను ఇప్పటికే 2-0 తేడాతో కోల్పోయింది. ఇక చివరి వన్డే సిడ్నీ వేదికగా శనివారం జరగనుంది. అలాగే సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో అక్టోబర్ 29 నుంచి టీమ్‌ఇండియా ఆసీస్‌తో అయిదు టీ20ల సిరీస్ ఆడనుంది.





## గంటసేపు వేచి చూసినా మాకు ట్రోఫీ కనిపించలేదు : తిలక్ వర్మ

అరుదైన వ్యాధితో బాధపడినట్లు భారత ఆటగాడు తిలక్ వర్మ సంచలన విషయాలను ఇటీవల వెల్లడించాడు. ఆ సమయంలో ముంబయి ఇండియన్స్ మేనేజ్‌మెంట్ తనను ఆదుకొందని గుర్తు చేసుకున్నాడు. తాజాగా ఆసియా కప్ ట్రోఫీ వ్యవహారంపై స్పందించాడు. ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించడంలో ఈ తెలుగు కుర్రాడిదే కీలక పాత్ర. అయితే, భారత్ గెలిచినా ట్రోఫీ ఇవ్వకుండా ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ 'పిల్ల చేష్టలు' సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ రోజు ఏం జరిగిందో తిలక్ వెల్లడించాడు. దాదాపు గంటసేపు మైదానంలో ఉన్నా సరే ట్రోఫీ తమకు కనిపించలేదని వ్యాఖ్యానించాడు. "మేమంతా మైదానంలో వేచి చూస్తూ ఉన్నాం. అప్పటికి దాదాపు గంట గడిచిపోయింది. ఇదంతా మీరు టీవీల్లోనూ చూసి ఉంటారు. నాతోపాటు మన ఆటగాళ్లంతా గ్రౌండ్‌లోనే పడుకొని ఉన్నాం. అర్ష్‌దీప్ సింగ్ మాత్రం రీల్స్ చేయడంలో బిజీగా ఉండిపోయాడు. ట్రోఫీ వచ్చేసిందని ఆలోచిస్తూ మేమంతా అలాగే ఉండిపోయాం. కానీ, మైదానంలో ఎక్కడా కూడా ట్రోఫీ కనిపించలేదు. అప్పుడు అర్ష్‌దీప్ కలుగజేసుకొని.. ట్రోఫీ అందుకొన్నట్లుగా క్రియేట్ చేశాడు. టీ20 వరల్డ్ కప్ సమయంలో ఎలా సంబరాలు చేసుకున్నామో.. ట్రోఫీ లేకపోయినా అలాగే చేద్దామని చెప్పాడు. నాతో పాటు మరో ఐదారుగురు క్రికెటర్లు అలాగే చేశాం" అని తిలక్ తెలిపాడు.

### నమ్మకంతో ఉన్నాం..

"ఆసియా కప్‌లో మేం మూడుసార్లు పాక్‌ను ఢీకొట్టాం. ఫైనల్‌లోనూ గెలుస్తామని మొదటినుంచి నమ్మకంతోనే ఉన్నాం. క్రికెట్ తమాషా గేమ్. ఇలాంటి మెగా టోర్నీల్లో ఆడితే ఆ మజానే వేరు. నేను పాకిస్థాన్‌పై ఎలాంటి ప్యాషన్‌తో ఆడానో.. ఇతర మ్యాచుల్లో అలా ఆడలేకపోవచ్చు. కానీ, జట్టు విజయం సాధించేందుకు చేసే ప్రయత్నం మాత్రం ఆగదు" అని తిలక్ వ్యాఖ్యానించాడు.

వరుసగా రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడంతో విరాట్ కోహ్లి ఇక ఆటకు గుడ్‌బై చెబుతాడనే చర్చ మొదలైంది. అయితే, ఇందులో పెద్దగా కంగారుపడాల్సిన అవసరమేమీ లేదని మాజీలు సూచించారు. ఒక్కసారి పరుగులు చేయడం మొదలుపెడితే ఆటోమేటిక్‌గా లయను అందుకుంటాడని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ తెలిపాడు. రెండు డకౌట్‌లు అయినంత మాత్రాన రిటైర్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు.



# సహనంగా ఉండు

## సోషల్ మీడియాను పట్టించుకోవద్దు

### కోహ్లికి ఇర్ఫాన్ సూచన

"ఇప్పటివరకు మనం విరాట్ కోహ్లి వరుసగా రెండు మ్యాచుల్లో డకౌట్ కావడం చూడలేదు. ఇలా జరగడానికి ఒత్తిడి, ఆటకు దూరమవడం వంటి కారణాలు ఉండొచ్చు. సోషల్ మీడియాలో మాత్రం దీనిపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది. విరాట్‌తోపాటు రోహిత్ విషయంలోనూ ఇదే డిస్కషన్. భారత్ కోసం వారిద్దరూ చాలా సాధించారు. ఇలాంటప్పుడు వారికి మద్దతు కావాలి. పరుగులు చేసేవరకూ సెలక్టర్లు నమ్మకం ఉంచాలి. యశస్వి జైస్వాల్ వంటి కుర్రాడు సిద్ధంగా ఉన్నప్పుడు సీనియర్లపై కత్తి వేలాడుతున్న భావన ఉంటుంది. ఇలాంటప్పుడు ఒత్తిడిని తట్టుకొని ఆటడం సులువేం కాదు. విరాట్ కోహ్లి విషయంలో బలహీనతను అధిగమించడానికి ప్రయత్నించి పెవిలియన్‌కు చేరాడు. తొలి మ్యాచ్‌లో ఆఫ్‌సైడ్ బంతికి ఔట్ అయ్యాడు. ఇక రెండో మ్యాచ్‌లో తనకు ఇష్టమైన ఫ్లిక్ షాట్ మిస్ కావడంతో ఎల్బీగా పెవిలియన్‌కు చేరాడు. ఇంతకుముందు అతడి నుంచి ఇలాంటి ఆటను చూడలేదు. దీని నుంచి అతడు ఎలా బయటపడాలి? అనే సందేహం వస్తుంది. అయితే, విరాట్ సింగిల్ తీసి స్ట్రైక్ నుంచి బయటపడాలి అనుకుంటాడు. అలాగని నిరాశ పడకూడదు. అలా చేస్తే ఆటను ఆస్వాదించడం ఆగిపోతుంది. ఒక్కసారి పరుగులు చేయడం మొదలుపెడితే అతడిని ఆపడం కష్టమే. ఎందుకంటే వన్డేలంటే కోహ్లికి చాలా ఇష్టం. ఈ సందర్భంగా అభిమానులకు ఓ విజ్ఞప్తి. దయచేసి ఎవరూ కూడా వరల్డ్ కప్‌లో ఆడతారా? లేదా? అనే చర్చ కొనసాగించవద్దు. ఇప్పుడు ఆ ఇద్దరూ ఆటను ఆస్వాదించేలా చూడాలి. వీలైనంత క్రికెట్‌ను ఆడేందుకు ప్రయత్నించాలి. తప్పకుండా విరాట్ తర్వాత మ్యాచ్‌లో ఫామ్ అందుకొంటాడని భావిస్తున్నా. అందుకోసం సహనంగా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే చర్చను అస్సలు పట్టించుకోవద్దు" అని ఇర్ఫాన్ వెల్లడించాడు.

### అవసరం లేదు : గావస్కర్

"విరాట్ కోహ్లి ఇప్పటివరకు వన్డేల్లో భారీగా పరుగులు చేశాడు. అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ కూడా అతడే. ఇప్పుడు వరుసగా రెండు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన పెద్ద ఇబ్బందేమీ లేదు. మరీ ఎక్కువగా ఆందోళన చెందక్కర్లేదు. విరాట్, రోహిత్‌లో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉంది. సిడ్నీలో విరాట్ నుంచి మంచి ఇన్నింగ్స్ చూస్తామని అనుకుంటున్నా. ఆస్ట్రేలియాలో అతడికి ఎంతో ఇష్టమైన మైదానం. ఇక్కడ సెంచరీలు చేశాడు. ప్రతిఒక్కరూ అతడి నుంచి మరోసారి భారీ ఇన్నింగ్స్ రావాలని ఆశించడంలో తప్పు లేదు" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

## ఆసియా కప్ ట్రోఫీని అబుదాబిలోని రహస్య ప్రదేశానికి తరలించిన నఖ్వీ



టీమ్‌ఇండియా సెప్టెంబర్ 28న ఆసియా కప్ టోర్నీలో విజేతగా నిలిచింది. దాదాపు నెల రోజులు కావస్తున్నా.. ఇప్పటికీ ట్రోఫీ, మెడల్స్ భారత్‌కు చేరలేదు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చీఫ్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ నఖ్వీ తాజాగా ట్రోఫీని ఏసీసీ హెడ్‌క్వార్టర్స్ నుంచి అబుదాబిలోని గుర్తు తెలియని ప్రాంతానికి తరలించాడని వార్తలు వస్తున్నాయి. బీసీసీఐకి చెందిన ఓ అధికారి ఇటీవల ఏసీసీ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడి నుంచి ట్రోఫీని సిబ్బంది తొలగించారని, ప్రస్తుతం అది నఖ్వీ స్వాధీనంలో అబుదాబిలో గుర్తుతెలియని ప్రదేశంలో ఉందని అతడికి తెలిసినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం పరిస్థితి మరింత సున్నితంగా మారింది. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాక్‌పై టీమ్‌ఇండియా గెలిచింది. అయితే, పహల్గాం దాడి నేపథ్యంలో నఖ్వీ నుంచి నేరుగా ట్రోఫీని స్వీకరించడానికి భారత జట్టు సభ్యులు ఆసక్తి చూపలేదు. దీంతో నఖ్వీ ఆ ట్రోఫీని, మెడల్స్‌ను హుందాగా వేరొకరితో టీమ్‌ఇండియాకు అందివ్వకుండా తనతోపాటు తీసుకెళ్లి, ఏసీసీ కార్యాలయంలో భద్రపరిచాడు. అప్పటి నుంచి.. ట్రోఫీని ఇవ్వడానికి అర్థం పర్థంలేని షరతులు పెడుతూ వస్తున్నాడు. బీసీసీఐ ప్రతినిధి, టీమ్‌ఇండియా ఆటగాడు ఒకరు వస్తేనే ట్రోఫీని వారిని నేరుగా అప్పగిస్తామని మొండిపట్టు పడుతున్నాడు. ఈ నేపథ్యంలోనే అతడి సూచనల మేరకు ట్రోఫీని దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీ కాంప్లెక్స్‌లోని ఏసీసీ కార్యాలయంలో ఉంచినట్లు తెలిసింది. అయితే తన అనుమతి లేకుండా ట్రోఫీ, మెడల్స్‌ను ఎవరికీ ఇవ్వకూడదని అతడు అధికారులను ఆదేశించినట్లు ఆరోపణలు వచ్చాయి. కానీ నఖ్వీ.. ప్రస్తుతం ట్రోఫీ, మెడల్స్‌ను ఏసీసీ కార్యాలయం నుంచి అబుదాబిలో మరో రహస్య ప్రదేశానికి తరలించాడని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వివాదం ఇప్పట్లో పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదు. బీసీసీఐ ఈ విషయమై ఐసీసీకి ఫిర్యాదు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



## ఓలా, ఉబర్‌కు పోటీగా 'భారత్ ట్యాక్సీ'

ఓలా, ఉబర్‌కు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ ని తీసుకొచ్చింది. ప్రైవేటు సంస్థలను సవాల్ చేసేలా ఈ సహకార ట్యాక్సీని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, నేషనల్ ఇ-గవర్నెన్స్ డివిజన్ అభివృద్ధి చేసింది. పైలట్ ప్రాతిపదికన నవంబర్ నుంచి దిల్లీలో ఈ సేవలు ప్రారంభంకానున్నాయి. తొలుత 650 మంది సొంతవాహనాలు కలిగిన డ్రైవర్లు దేశ రాజధాని నగరంలో ఈ సేవలు అందించనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే.. డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సహకార్ ట్యాక్సీ గురించి గతంలో కేంద్ర సహకార మంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. సహకార సంఘాల మాదిరిగా ఇది పనిచేస్తుంది. దీంతో ఇందులో నమోదు చేసుకున్న డ్రైవర్లకు మేలు చేకూరుతుంది. టూవీలర్, ఆటోలు, ఫోర్ వీలర్లు సహకార్ ట్యాక్సీలో భాగంగా సేవలందిస్తాయని అమిత్ షా చెప్పారు. ఇందులోని లాభాలన్నీ ఏ ఒక్క కంపెనీకో పరిమితం కాకుండా.. డ్రైవర్లకు లబ్ధి చేకూరుతుందని మంత్రి వివరించారు. యాప్ ఆధారిత ట్యాక్సీ సర్వీసులపై కొన్ని సంవత్సరాలుగా వినియోగదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధరలు, క్యాన్సిలేషన్లతో పాటు తమ ఆదాయం నుంచి కంపెనీలు 25 శాతం వరకు కమీషన్ తీసుకోవడంపై డ్రైవర్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటికీ సమాధానం ఇచ్చేలా కేంద్రం భారత్ ట్యాక్సీని తీసుకొస్తోంది. ఇందులో నమోదు చేసుకున్న ట్యాక్సీ డ్రైవర్లు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. మెంబర్‌షిప్ కింద స్వల్ప మొత్తం ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. 2026 మార్చి నాటికి మెట్రో నగరాల్లో ఈ భారత్ ట్యాక్సీ సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి లక్ష మంది డ్రైవర్లను ఈ ప్లాట్‌ఫామ్‌లో భాగం చేయాలని చూస్తోంది. సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ కింద ఈ ట్యాక్సీ సేవలు అందనున్నాయి. ఆ సంస్థను 2025 జూన్‌లో ఏర్పాటు చేశారు.




## బ్యాంకింగ్ రంగంలోకి మరో విదేశీ పెట్టుబడి..

### ఫెడరల్ బ్యాంక్‌లో బ్లాక్‌స్టోన్‌కు 10% వాటా

దేశీయ బ్యాంకింగ్ రంగంలోకి విదేశీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఇటీవల ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ 3 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రైవేటు బ్యాంకింగ్ రంగంలో ఇదే అతిపెద్ద పెట్టుబడిగానూ నిలిచింది. తాజాగా మరో ప్రైవేటు బ్యాంక్ ఫెడరల్ బ్యాంకులో న్యూయార్క్‌కు చెందిన బ్లాక్‌స్టోన్ కంపెనీ 9.99 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. బ్లాక్‌స్టోన్ అనుబంధ ఆసియా %××% టోప్కో ద్వారా రూ.6,196.51 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. కోచికి చెందిన ఫెడరల్ బ్యాంక్ ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 272.97 మిలియన్ వారెంట్లను బ్లాక్‌స్టోన్‌కు జారీ చేయనుంది. రూ.2 ముఖ విలువ కలిగిన ఈ షేర్లను రూ.227 వద్ద వీటిని కన్వర్ట్ చేసుకోవచ్చు. ఈ వారెంట్ల కింద ఫెడరల్ బ్యాంకులో బ్లాక్‌స్టోన్‌కు 9.99 శాతం వాటా దఖలు పడనుంది. ఈ పెట్టుబడికి నియంత్రణ సంస్థలు, వాటాదారుల నుంచి ఆమోదానికి లోబడి ఉంటుంది. ఈ వారెంట్లను అలాట్ చేసిన తేదీ నుంచి 18 నెలల గడువు ఉంటుంది. సబ్‌స్క్రిప్షన్ సమయంలో 25 శాతం బ్లాక్‌స్టోన్ పెట్టుబడి పెడుతుంది. మిగిలిన 75 శాతం పెట్టుబడిని వారెంట్లను ఈక్విటీగా మార్చుకున్న సమయంలో చెల్లింపులు చేస్తుంది. ఈ ఒప్పందంలో భాగంగా బ్యాంక్ బోర్డులో ఒక నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను బ్లాక్‌స్టోన్ నియమించుకోవచ్చు. బ్లాక్‌స్టోన్ పెట్టుబడికి సంబంధించి నవంబర్ 19న ఫెడరల్ బ్యాంక్ అసాధారణ సమావేశం (ఈజీఎం) నిర్వహించనుంది. వీడియో కాన్ఫరెన్స్ రూపంలో జరిగే ఈ సమావేశంలో ప్రిఫరెన్షియల్ ఇష్యూ, బోర్డు నామినేషన్ రైట్స్‌కు సంబంధించి వాటాదారుల నుంచి ఆమోదం తీసుకోనున్నారు. మరోవైపు ఇటీవల కాలంలో మిడ్‌సైజ్ ప్రైవేటు బ్యాంకుల్లోకి విదేశీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. ఆర్‌బీఐఎల్‌లో ఎమిరేట్స్ ఎన్‌బీడీ తాజాగా పెట్టుబడి పెట్టగా.. జపాన్‌కు చెందిన ఎస్ఎంబీఈసీ యెస్ బ్యాంకులో 24 శాతం వాటాను పొందింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో వార్‌బర్గ్ పింకస్, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ 877 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాయి.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# రాజమౌళి, మహేశ్ బాబుల మూవీ

## మ్యూజిక్ సెషన్ మొదలయ్యిందన్న కాలభైరవ

ఎస్ఎస్ఎంబి 29 ప్రస్తుతం భారతీయ సినీ ఇండస్ట్రీలో క్రేజీ ప్రాజెక్ట్. మహేశ్‌బాబు కథానాయకుడిగా అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీకి సంబంధించి ఎప్పుడెప్పుడు అప్‌డేట్‌లు వస్తాయా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు కాల భైరవ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఆయన స్వరాలు సమకూర్చిన మోగ్లీ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మహేశ్, రాజమౌళి ప్రాజెక్ట్‌కు సంబంధించి అప్‌డేట్‌ను ఇచ్చారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించి సంగీత కార్యక్రమాలు మొదలైనట్లు తెలిపారు. నాన్నగారి సినిమాల్లో వర్క్ ఉంటే, కచ్చితంగా చెబుతారు. ముఖ్యంగా రికార్డింగ్ సెషన్స్‌కు వెళ్తా. ఎస్ఎస్ఎంబి 29కు సంబంధించి కూడా మ్యూజిక్ పనులు ఇటీవల మొదలయ్యాయి. నేను కూడా అందులో భాగమయ్యా అని అన్నారు. దీంతో మహేశ్ అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ మూవీకి సంబంధించి అసలైన అప్‌డేట్ నవంబరులో రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టైటిల్‌ను వెల్లడించడంతో పాటు, ఓ వీడియోను కూడా విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులను కూడా పూర్తి చేశారట. హైదరాబాద్ వేదికగా ప్రెస్‌మీట్ లేదా ఈవెంట్‌ను నిర్వహించి వీడియోను విడుదల చేయనున్నారు. అప్పుడే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం అనువైన వేదిక కోసం చిత్ర బృందం శోధన మొదలు పెట్టింది. నెలాఖరులోగా దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం.





# మణిరత్నం డైరెక్షన్‌లో ప్రేమ కథ చిత్రం..

## హీరోయిన్‌గా ఆఫర్ అందుకున్న రుక్మిణి వసంత్

ఈ ఏడాది 'థగ్ లైఫ్' చిత్రంతో ఆడియన్స్ ముందుకు వచ్చాడు డైరెక్టర్ మణిరత్నం. కమల్ హాసన్, త్రిష కృష్ణన్ జంటగా నటించిన ఈ సినిమా యాక్షన్ డ్రామాగా తెరకెక్కి జూన్ 5న థియేటర్స్‌లో రిలీజై యావరేజ్ టాక్ సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే.. ఇప్పుడు డైరెక్టర్ మణిరత్నం తన తదుపరి మూవీ కోసం సిద్ధం అవుతున్నాడు. ఈసారి యాక్షన్ డ్రామాతో కాకుండా.. ప్రేమ కథ చిత్రంతో అలరించేందుకు రెడీగా ఉన్నాడు. ఇందులో మొదట హీరోగా ధృవ్ విక్రమ్ ఎంపిక చేశారట. కానీ ఇప్పుడు వేరే హీరో కోసం వెతుకుతున్నట్లు తెలుస్తుంది. ధృవ్‌తో తర్వాత యాక్షన్ చిత్రం చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడట. అందుకే ఇప్పుడు తెరకెక్కించబోయే ప్రేమ కథ చిత్రానికి వేరే హీరో కోసం వెతుకుతున్నాడట మణిరత్నం. దీనికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిచబోతుండగా.. ఇప్పటికే రెండు పాటలు కంపోజ్ చేశారు. కొడైకెనాల్‌లో స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తికాగా.. లొకేషన్ స్కౌటింగ్ దాదాపు సెట్ అయిందని సమాచారం. షూటింగ్ వచ్చే నెలలో ప్రారంభమవుతుందని తెలుస్తుండగా.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ త్వరలో రాబోతున్నట్లు టాక్. కాగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ ఆల్మోస్ట్ కన్ఫర్మ్ అయింది.

# 'కాంతార చాప్టర్ 1' మరో రికార్డు..

## అలా తొలి ఇండియన్ మూవీ



'కాంతార ఛాప్టర్ 1' మరో రికార్డు సొంతం చేసుకుంటోంది. క్రిస్పీ రన్‌టైమ్‌తో ఇంగ్లిష్‌లో విడుదల కానున్న తొలి భారతీయ సినిమాగా నిలవనుంది. ఆంగ్లంలో డబ్ అయిన ఈ మూవీ ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సినిమా అసలు నిడివి 2 గంటల 49 నిమిషాలు కాగా ఇంగ్లిష్ వెర్షన్‌లో 2:14 గంటల రన్‌టైమ్‌తో రిలీజ్ అవుతోంది. కొన్ని భారతీయ సినిమాలు ఒరిజినల్ రన్‌టైమ్‌తోనే ఇంగ్లిష్‌లో విడుదలయ్యాయిగానీ ట్రిమ్ చేసి రిలీజ్ చేస్తుండటం ఇదే తొలిసారి.

# శ్రీలంకలో పెద్ది పాట షూటింగ్





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి చిత్రం పెద్ది కోసం శ్రీలంకకు బయల్దేరారు. ఉప్పెన ఫేమ్ డైరెక్టర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని అంటుతు న్నాయి. సినిమా షూటింగ్ కోసం హీరో రామ్ చరణ్ మరియు డైరెక్టర్ బుచ్చి బాబు సానా శ్రీలంకకు బయల్దేరారు. సమాచారం ప్రకారం, రేపటి నుండే అక్కడ పెద్ది షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ శ్రీలంక షెడ్యూల్‌లో, టీమ్ పెద్ది కొన్ని కీలకమైన సన్నివేశాలను, ఒక పాటను చిత్రీకరించనుంది. శ్రీలంకలోని అద్భుతమైన లొకేషన్లలో హీరో చరణ్, హీరోయిన్ జాన్వీ కాంబినేషన్లో ఈ పాటను షూట్ చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేసింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా మ్యూజికల్ అప్‌డేట్ గురించి కూడా ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. శ్రీలంకలో ఈ షూటింగ్ షెడ్యూల్ చురుకుగా పూర్తి చేసిన వెంటనే, ఈ సినిమా నుండి మొదటి సింగిల్‌ను విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷లాన్ చేస్తున్నారు. విశేషమేమిటంటే, ఈ మొదటి సింగిల్ పాటలో శ్రీలంకలో చిత్రీకరించిన అద్భుతమైన విజువల్స్‌ను జత చేయనున్నారు. దీంతో, సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# ఓటిటిలోకి 31న వస్తోన్న కొత్తలోక

చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాసింది కొత్తలోక: చాప్టర్ 1 కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిందీ సినిమా. ఈ మూవీ ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా? అని అభిమానులు ఎదురుచూశారు. తాజాగా వారి ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ జియో హాట్‌స్టార్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ 31 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది. తెలుగు, మలయాళం, తమిళ, హిందీతో పాటు బెంగాలీ, మరాఠీలలోనూ ఇది స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్ విడుదల చేసింది. చంద్ర అలియాస్ నీలి (కల్యాణి ప్రియదర్శన్) అతీంద్రియ శక్తులు కలిగి ఉంటుంది. ఒక మిషన్‌లో ఆమె త్రుటిలో శత్రువుల నుంచి తప్పించుకుంటుంది. దీంతో చంద్ర స్వీడన్ నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యి తన గురించి ఎవరికీ తెలియకుండా ఒక కేఫ్‌లో పనిచేస్తూ ఉంటుంది. ఆమె పక్కింట్లో ఉండే సన్నీ (నస్లేన్) ఆమెతో స్నేహం పెంచుకుంటాడు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ నాచియప్ప గౌడ (శాండి మాస్టర్), అతడి బాస్ మానవ అవయవాల అక్రమ రవాణా చేస్తుంటారు. అనుకోకుండా తారసపడిన చంద్రపై నాచియప్పకు అనుమానం కలుగుతుంది. మరి ఆ తర్వాత అతడు ఏం చేశాడు? అసలు చంద్ర ఎవరు..? ఆమెను చూసి సన్నీ ఎందుకు అంతగా భయపడ్డాడు? అనేది చిత్ర కథ.ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూలు చేసింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది.

# నవంబర్ 5న రాజాసాహెబ్ ఫస్ట్ సింగిల్

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ది రాజా సాబ్. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన రాజాసాబ్ ఫస్ట్ గ్లిమ్స్, ట్రైలర్ కు భారీ స్పందన వచ్చింది. రెబల్ స్టార్ బర్త్ డే సందర్భంగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని సంగీత దర్శకుడు తమన్ ఆ మధ్య హింట్ ఇచ్చాడు కానీ ఎటువంటి అప్డేట్ ఇవ్వకుండా జస్ట్ పోస్టర్ తో సరిపెట్టారు మేకర్స్. దాంతో ఫ్యాన్స్ కాస్త డిజప్పోయింట్ అయ్యారు. కనీసం ఫస్ట్ సింగిల్ రిలీజ్ ఎప్పుడు ఉంటుందని డేట్ కూడా చెప్పలేదని సోషల్ మీడియాలో కామెంట్స్ చేసారు. తాజాగా పీపుల్స్ మీడియా నిర్మించిన మరో సినిమా మోగ్లీ ఫస్ట్ సింగిల్ లాంచ్ లో నిర్మాత విశ్వప్రసాద్ మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడూతూ రాజసాబ్ ఫస్ట్ సింగిల్ ను నవంబరు 5న రిలీజ్ చేస్తాము. అలాగే జనవరి 9న వరల్డ్ వైడ్ గా సినిమా రిలీజ్ అవుతుంది. రిలీజ్ కు ముందు రాజాసాబ్ సెకండ్ ట్రైలర్ ను రిలీజ్ చేస్తాం అని అన్నారు. రెబల్ స్టార్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఫస్ట్ సింగిల్ అప్డేట్ రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.



# ఓటిటిలోకి వచ్చేస్తున్న ఇడ్లికొట్టు

ధనుష్ , నిత్యా మేనన్ జంటగా నటించిన చిత్రం ఇడ్లీ కొట్టు. ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తన వ్యక్తిత్వం కోసం ఉద్యోగాన్ని వదిలి.. తండ్రి వారసత్వంగా ఇడ్లీ కొట్టు నడిపే సాధారణ వ్యక్తి పాత్రలో ధనుష్ కనిపించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందడం, విజయవంతమైన తిరు తర్వాత ధనుష్, నిత్యామేనన్ కలిసి నటించడంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, ఆ స్థాయి వినోదాన్ని మాత్రం అందించలేకపోయింది. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. అక్టోబరు 29వ తేదీ నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ పోస్టర్‌ను పంచుకుంది. శివ కేశవులు (రాజ్‌కిరణ్) ఇడ్లీ కొట్టు అంటే ఆ ఊళ్లో ఫేమస్. ఎంతో ఇష్టంగా, మనసు పెట్టి చేసే ఆ కొట్లో ఇడ్లీలు ఎంతో రుచికరం. శివ కేశవులు కొడుకే మురళి (ధనుష్). కొత్తతరం కుర్రాడు కదా, తన తండ్రి నడుపుతున్న కొట్టుని కాస్త ఫ్రాంచైజీలా మార్చేసి, అదే పేరుతో ఇతర చోట్ల కూడా హోటల్స్‌ని ఏర్పాటు చేసి డబ్బు సంపాదించాలని ఆశపడతాడు. కానీ, తన చేతులతో చేయని ఇడ్లీలను తన పేరుతో అమ్మడానికిససేమిరా ఇష్టపడడు శివకేశవులు. దాంతో మురళి ఉన్నతమైన జీవితం అంటూ కన్నవాళ్లని, ఉన్న ఊరుని వదిలి పట్నం బాట పడతాడు. అలా మొదలైన అతని పరుగు బ్యాంకాక్‌కి చేరుతుంది. పనుల్లో పడి కన్నవాళ్లని కూడా పట్టించుకోడు. బ్యాంకాక్‌లోనే తన బిజినెస్‌లో పార్ట్‌నర్ అయిన విష్ణువర్ధన్ (సత్యరాజ్) కూతురు మీరా (షాలిని పాండే)తో పెళ్లి నిశ్చయమవుతుంది. మరికొన్ని రోజుల్లో పెళ్లి అనగా మురళి తండ్రి శివ కేశవులు చనిపోతాడు. తండ్రి చివరి చూపు కోసం వచ్చిన మురళి తిరిగి బ్యాంకాక్ వెళ్లాడా లేదా?శివకేశవులు చనిపోయాక ఆయన ఇడ్లీ కొట్టు ఏమైంది?మురళికీ, కల్యాణి (నిత్య మేనన్)కీ మధ్య సంబంధం ఏమిటి?మీరాతో అతని పెళ్లి జరిగిందా? అన్నది చిత్ర కథ.




# బాలయ్యతో గోపీచంద్ మలినేని మూవీ

బాలయ్యకు వీరసింహ రెడ్డి వంటి సూపర్ హిట్ సినిమాను అందించిన గోపీచంద్ మలినేనితో మరో సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. రాయలసీమ నేపథ్యంలో వీరసింహ రెడ్డితో సూపర్ హిట్ ఇచ్చిన గోపీచంద్ మలినేని ఈ సారి సరికొత్త ప్రయోగానికి రెడీ అవుతున్నాడు. ఈ సినిమాపై ఇప్పటి నుండి అభిమానుల్లో అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఈ పవర్ఫుల్ కాంబోను అత్యంత భారీ బ్జడెట్ పై వృద్ధి సినిమాస్ బ్యానర్ లో సతీష్ కిలారు నిర్మించనున్నారు. ఎన్‌బికె111 టైటిల్ తో తెరకెక్కుస్తున్న ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లేందుకు ముహూర్తం ఫిక్స్ అయింది. నవంబరు 7 తారీఖున ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నారు. మాస్ యాక్షన్ అంశాలతో పాటు సినిమా రెండు వేరు వేరు కాలాలకు చెందిన హిస్టారికల్ స్టోరీ అని చరిత్రను.. వంర్తమానాన్ని ముడిపెడుతూ ఎపిక్ స్టోరీని రెడీ చేసినట్టు తెలుస్తోంది.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com